
రాయచోటిలో అసంపూర్తిగా నిలిచిపోయిన అండర్‌గ్రౌండు డ్రైనేజి పనులు



- నేతలారా.. గొంతు విప్పండి
- జిల్లాలో ఆగిపోయిన అభివృద్ధి పనులు
- పేరుకుపోయిన సమస్యలు..
- వైసీపీ పాలనలో కానరాని అభివృద్ధి

అధ్యక్షా..!!



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అధ్యక్షా..! మా ప్రాంతంలో గత ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోక పేరుకుపోయాయి. కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లు ఎక్కడ చూసినా మోకాటి లోతు గుంతలతో నిండి ఉన్నాయి. సాగు, తాగునీటి ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. వాటి మరమ్మతుల ఊసే జగన్‌రెడ్డి పట్టించుకోలేదు. నికరంగా పట్టుమని పదెకరాలకు నీళ్లిచ్చే సాగునీటి ప్రాజెక్టులు జిల్లాలో లేవు. కనీసం వందమందికి ఉపాధి ఇచ్చే పరిశ్రమలు ఒకటీ లేవు. పేరుకే కొత్త జిల్లా ఏర్పడినప్పటికీ సమస్యలు తట్టెడు ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి... ఉన్న సమస్యలన్నింటినీ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించాలని జిల్లాకు చెందిన అన్ని పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు ముఖ్యమైన సమస్యలపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

రైల్వేకోడూరు నియోజకవర్గం

పట్టణంలో నాలుగు లేన్ల రోడ్ల విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కడప నుంచి రేణిగుంట వరకు మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ.1600 కోట్లు విడుదల చేసింది. తర్వాత. రూ.300 కోట్లు విడుదల చేశారు. అధికారులను అడిగితే.. మొదటి నుంచి పనులు చేపడుతున్నట్లు చెబుతున్నారు. కానీ ఎక్కడా పనులు జరుగుతున్న దాఖలాలు లేవు. ఈ రోడ్డులో తిరుపతికి వెళ్లే వారికి గుంతలతో ఒళ్లు హూనం కావాల్సిందే. ఈ రోడ్డు మీద వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్వరమే ఈ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో అరటి, బొప్పాయి. మామిడి పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. ప్రధానంగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేవరకు దాచుకునేందుకు శీతల గిడ్డంగులు లేవు.


తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు

దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోడూరు-వెంకటగిరి రోడ్డు 30 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండిపోయింది. అటవీశాఖ అనుమతులు లేక మరుగున పడిపోయింది. పెనగలూరులో సోమశిల వెనక జలాల లిఫ్ట్ ఇరిగేషన్ చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. అనంతరాజుపేట అప్పు జ్యూస్ ఫ్యాక్టరీ మూతపడి 25 ఏళ్లు దాటుతోంది. ఇంతవరకు ఈ పరిశ్రమను పట్టించుకునే నాథుడు లేడు. ఈ పరిశ్రమను పునఃప్రారంభిస్తే చాలా మంది కార్మికులకు ఉపాధి దొరుకుతుంది.

రాజంపేట...

అన్నమయ్య ప్రాజెక్టు వరద నీటికి కొట్టుకుపోయి ఇప్పటికి మూడు సంవత్సరాలు కావస్తోంది. ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో నీటిలో సర్వం కోల్పోయిన బాధితులను జగన్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకోలేదు. ఇళ్లు కోల్పోయిన వారికి ఇప్పటికీ ఇళ్లు నిర్మించలేదు. ప్రాజెక్టు పునర్నిర్మించేందుకు పైసా డబ్బు విదిల్చలేదు. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా నిర్మించి ఎగువ, దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించాలి. ఈ ప్రాజెక్టు దిగువన ఉన్న పలు గ్రామాల్లోకి వరద నీళ్లు రాకుండా రక్షణ గోడలు నిర్మించాలి. రాజంపేట పట్టణానికి రింగురోడ్డు లేకపోవడంతో పట్టణ ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. రాజంపేట ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్‌లు లేక ఉద్యానరైతులు నష్టపోతున్నారు. నందలూరులో మూసివేసిన ఆల్విన్ ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీలకు బదులుగా ప్రత్యామ్నాయ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. ఒంటిమిట్ట చెరువుకు నీరిందించే శ్రీరామ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి సాగునీరు అందించాలి.

రాయచోటి...

రాయచోటి పట్టణంలో ప్రధానంగా ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన జాతీయ రహదారి పనులు వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పూర్తయినప్పటికీ పూర్తి చేయకపోవడంతో ఇప్పటికీ రాయచోటిలో నాలుగు వరసల జాతీయ రహదారి పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంజూరైన రాయచోటి రింగు రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. పట్టణంలో రూ.300 కోట్లతో చేపట్టిన అండర్‌గ్రౌండు డ్రైనేజి పనులు పట్టణంలో ఎక్కడా జరగడం లేదు. ఇప్పటి వరకు జరిగిన పనులన్నీ ఊరిబయట నివాసాలు లేని చోట జరిగాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు అర్ధాంతరంగా వదిలేసి వెళ్లిపోయారు. పట్టణానికి రూ.90 కోట్లతో రెండవ దశ వెలిగల్లు నీటి పథకం పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రాయచోటి స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీలో సౌకర్యాలు పేరుకు తగ్గట్టు లేవు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన రోడ్ల దుస్థితి దయనీయంగా ఉంది. ఏళ్ల తరబడి రోడ్ల మరమ్మతులు చేయకపోవడంతో మోకాటి లోతు గుంతలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కాలువలు పూర్తి కాలేదు. పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. సబ్‌కెనాల్స్ పూర్తి కాలేదు. దీంతో చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందడం లేదు. ఝరికోన ప్రాజెక్టు పూర్తయి 15 సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటికీ కాలువలకు మోక్షం కలగలేదు.

పీలేరు...

అడవిపల్లె రిజర్వాయర్ నిర్మాణానికి రూ.84.80 కోట్లు ఖర్చు పెట్టినా రైతులకు ఉపయోగం లేదు. ఇప్పటికీ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కాలువలు పూర్తి కాలేదు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో సాగు, తాగునీరు కోసం 2006లో వైఎస్ సర్కారు, హంద్రీనీవా పథకంలో భాగంగా కేవీ పల్లె మండలం అడవిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కేవీ పల్లె, పీలేరు, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల పాకాల, ఐరాల, పూతలపట్టు, తవణంపల్లె, బంగారుపాలెం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు మండలాల్లో సుమారు 80 వేల ఎకరాలకు నీళ్ల లక్ష్యం.. 2006లో మొదలై.. 2016లో పూర్తయ్యాయి. మొదటి దశ.. రెండవ దశ పనులు 2016లో మొదలయ్యాయి. ఇప్పటికీ పూర్తి కాలేదు. పీలేరులో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు కాలేదు. పట్టణంలో పద్మావతినగర్ మీదుగా స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ, కొత్తపల్లె గ్రామాలకు వెళ్లేందుకు ప్రతిపాదించిన రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనుల నిర్మాణం కలగానే మిగిలిపోయింది. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం రూ.2 కోట్లు మంజూరు చేసినా ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. బాహుదా నదిపైన మేడికుర్తి ప్రాజెక్టు కొట్టుకుపోయింది.. ఇంకా మరమ్మతులు చేయలేదు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులు ప్రశ్నార్థకంగా మిగిలిపోయాయి.




రైల్వేకోడూరులో మూతపడ్డ జ్యూస్ ఫ్యాక్టరీ

మదనపల్లె, తంబళ్లపల్లె...

మదనపల్లె పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి శాశ్వత పరిష్కారానికి ఉద్దేశించిన చిప్పిలి, వలసపల్లె పంచాయతీలోని గుట్టకిందపల్లె సమ్మర్‌స్టోరేజీ (ఎస్‌ఎస్ ట్యాంకులు) ఇప్పటికీ పూర్తి కాలేదు. కట్ట పనులు పూర్తయి పదేళ్లయినా మొరవ పనుల్లో పురోగతి లేదు. మదనపల్లె నుంచి నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలను కలుపుతూ ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు చేయకపోవడంతో ఇక్కడ తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గంలో బెంగళూరుకు కూడా ఎక్కువగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయి.

మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఎక్కువగా సాగయ్యే టమోటా ఆధారిత పరిశ్రమ, శీతల గిడ్డంగులు లేవు. దీంతో ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో ఎక్కువగా ఉన్న చేనేత కార్మికుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. చేనేత మగ్గాలు నిర్వహిస్తున్న నివాసాలు, భవనాలకు ఉన్న విద్యుత్తును గృహ వినియోగం కింద, మున్సిపల్ ట్యాక్సును కమర్షియల్ కేటగిరీ నుంచి రెసిడెన్షియల్ కింద మార్పు చేయకపోవడంతో.. చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లెలో ఉత్పత్తి అయ్యే పట్టుచీరలకు బ్రాండ్ ఇమేజ్, చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ హామీ ఇచ్చారు. దానిని వెంటనే అమలు చేయాలని నేతన్నలు కోరుతున్నారు.

మదనపల్లె మండలం
చిప్పిలి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పూర్తయినా, పూర్తికాని మొరవ పనులు



అడిషనల్ ఎస్పీగా వెంకటాద్రి



రాయచోటి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ ఎస్పీగా వెంకటాద్రిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లా ఏఎస్పీగా ఉన్న వీబీ రాజ్‌కమల్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో రాజశేఖర్‌రాజును అడిషనల్ ఎస్పీగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే సిక్ లీవులో వెళ్లారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టులో రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటాద్రిని నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటాద్రి గతంలో ఉమ్మడి కడప జిల్లాలో ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా పనిచేశారు.

మద్యం ముట్టరు.. మాంసం తినరు

- గ్రామంలో పాదరక్షలు వేసుకోరు
- పల్లె ప్రజలందరిదీ ఒకేమాట.. ఒకే బాట
- ఆచారాలన్నీ తూ.చా. తప్పకుండా పాటిస్తున్న పెద్దగొడుగు స్వామి భక్తులు

6


ఊరిబయటే వదిలిన చెప్పులు

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి : కలెక్టర్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆగస్టు 5న జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లాల వారీగా డీఆర్‌డీఏ, పర్యాటకం, పంచాయతీరాజ్, నైపుణ్య అభివృద్ధి, ఐసీడీఎస్, ఆరోగ్య తదితర శాఖలకు సంబంధించిన లక్ష్యాలపై కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 5న జరిగిన సదస్సులో వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మరో కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తారని దీనికి అనుగుణంగా ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలను ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సీపీవో వెంకట్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ లోన్లను త్వరగా రీషెడ్యూల్ చేయాలి

జిల్లాలో కరువు మండలాల వ్యవసాయ లోన్లను త్వరగా రీషెడ్యూల్ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని జిల్లా ఎల్డీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎల్డీఎం ఆంజనేయులు జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన కరువు మండలాలకు సంబంధించిన వివిధ మార్గదర్శకాలను కలెక్టర్‌కు కమిటీ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు మండలాలుగా 54 మండలాలను ప్రభుత్వం గుర్తించిందని, అందులో 19 మండలాలు అన్నమయ్య జిల్లాలో ఉన్నాయన్నారు. జిల్లాలోని కరువు మండలాలకు సంబంధించిన వ్యవసాయ లోన్లను త్వరగా రీ షెడ్యూల్ చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. రైతులకు కొత్త వ్యవసాయ లోన్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎం ఆంజనేయులు, వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, డీసీసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు భవన నిర్మాణ పనుల పరిశీలన


సబ్‌జైలు నిర్మాణాల లోపలి భాగంలో పరిశీలిస్తున్న డీఐజీ రాజేశ్వర్‌రావ్, తదితరులు

వాల్మీకిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని మదనపల్లె మార్గంలో ఉన్న నూతన సబ్‌జైలు భవన నిర్మాణాన్ని రాయలసీమ జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వర్‌రావ్ పరిశీలించారు. గత పదేళ్లుగా నూతన సబ్‌జైలు భవనాలు నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం సబ్‌జైలు భవన నిర్మాణాలు లోపలి భాగంలో ప్రస్తుత స్థితిగతులను, భవనాల పరిస్థితులను పరిశీలించారు. 2014లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.3.5 కోట్లతో నూతన సబ్‌జైలు భవనాలకు నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనులు కూడా పూర్తి స్థాయిలో జరిగాయి. అయితే గడిచిన రెండు ప్రభుత్వాల కాలంలో నూతన సబ్‌జైలు ప్రారంభానికి నోచుకోక అరణ్య ప్రాంతంలా తయారైంది. రూ.కోట్లు వెచ్చించి గాలికి వదిలేసిన నిర్మాణాల పట్ల ప్రస్తుత పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, అసెంబ్లీలో సబ్‌జైలు ప్రస్తావన రావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జైళ్ల శాఖ అధికారులు సబ్‌జైలు భవనాలు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటుంటున్నట్లు తెలుస్తోంది. అయితే సబ్‌జైలు భవనాల లోపలి భాగంలో ఇప్పటికే చాలా వరకు దెబ్బతిని మళ్లీ ప్రభుత్వానికి నిర్మాణ పనులు భారం కానుండడం గమనార్హం. కాగా హడావిడిగా జైళ్ల శాఖ అధికారి సబ్‌జైలు భవనాలను పరిశీలించి వెళ్లిపోవడం, మీడియాకు సైతం సమాచారం లేకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జిల్లా జైళ్ల శాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, మదనపల్లె జైలర్ రామక్రిష్ణ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

‘అపార్’ కష్టాలకు చెక్..!

- మున్సిపాలిటీలో అదనపు కౌంటర్లు ఏర్పాటు
- పర్యవేక్షణకు అధికారుల నియామకం
- మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ తనిఖీ


కేంద్రాలలో సేవలపై మేనేజర్ మనోహర్‌ను అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ మనూజ, కమిషనర్ ప్రమీల


సర్టిఫికెట్లలో సవరణకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రం

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అపార్ ఐడీ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులకు చెక్ పడింది. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల మున్సిపల్ కార్యాలయంలో అదనంగా మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. బర్త్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్న విభాగం ఇరుకైన గదిలో ఉండటం, దానికి తోడు విద్యార్థులు రెండు మూడు ప్రాంతాలకు తిరగాల్సి రావడంతో కమిషనర్ ఈ సేవలన్నీ ఒకే చోటికి తీసుకొచ్చారు. మాన్యువల్ రికార్డుతో పాటు కంప్యూటర్లను కూడా కార్యాలయం ఆవరణంలోకి తెచ్చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా మూడు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆరుగురు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో పాటు పది మంది సిబ్బందిని నియమించారు. పట్టణంతో పాటు మదనపల్లె డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల కోసం షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. బర్త్ సర్టిఫికెట్‌లో సవరణలు, కొత్తగా జనన ధ్రువీకరణ పత్రం కావాల్సిన వారికి ఈ కేంద్రాలు ఉపయోగపడుతున్నాయి. విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు ఆధార్, ఆసుపత్రి రికార్డులు తీసుకొచ్చి అక్కడే దరఖాస్తులను పూర్తి చేసి అక్కడిక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వాటిని మున్సిపల్ అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి వెంకటేషన్‌నాయుడు, కమిషనర్‌లు ఆమోదిస్తూ, అప్పటికప్పుడే, లేదా ఒకటి, రెండురోజుల్లో వరుస క్రమంలో అందజేస్తున్నారు. ఆమోదం అయినట్లు లబ్ధిదారుల ఫోన్‌కు మెసేజ్ రావడం లేదా వారికి ఇచ్చిన ఐడీని కంప్యూటర్‌లో చెక్ చేసి ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తున్నారు. దీంతో సచివాలయాలు, మీ సేవ కేంద్రాలకు రోజుల తరబడి తిరిగే పనిలేకుండా అప్పటికప్పుడే లేక ఒకరోజు వ్యవధిలో జారీ చేయడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానంలో రోజుకు 250 నుంచి 300 సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు కమిషనర్ కె.ప్రమీల, ఏఎస్‌వో వెంకటేష్‌నాయుడు చెబుతున్నారు. అలాగే ఇదివరకే ఇలాంటి కరెక్షన్‌కోసం మూడు సచివాలయాల్లో మాత్రమే సేవలు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని 44 సచివాలయాలకు సేవలు విస్తరిస్తూ కమిషనర్ తీసుకున్న నిర్ణయంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బయట సర్టిఫికెట్ల సవరణ కోసం రూ.350 నుంచి రూ.750 తీసుకుంటుండగా ఆ విధానానికి కమిషనర్ చెక్ పెట్టారు. ఇందుకోసం కేవలం వంద రూపాయలు మున్సిపాలిటీకి చలానా రూపంలో చెల్లించే సౌకర్యాన్ని కేంద్రం వద్ద ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఈ కేంద్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల, మున్సిపల్ మేనేజర్ పి.ఆర్.మనోహర్, ఏఎస్‌వో వెంకటేషన్‌నాయుడులు తనిఖీ చేస్తూ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. మరోవైపు అక్కడికి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతూ సేవలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ఆధార్, ఇతర పత్రాలు అందజేస్తే మున్సిపల్ సిబ్బందే దరఖాస్తులు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ఆ 11మంది ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయండి

● సబ్‌కలెక్టరేట్ ఎదుట జనసేన డిమాండ్



సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

మదనపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీకి రాని ఆ 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షైఫోర్సు మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ అసెంబ్లీకి రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజలను అవమానించినట్లేనని, ప్రజాసమస్యలపై చర్చించడానికి అసెంబ్లీకి రాకపోవడంపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఆ వైసీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ మేరకు వీరిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కోరారు. ఎక్కడా లేని విధంగా రాజంపేట పార్లమెంటులో పుంగనూరు, తంబళ్లపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, అమర్నాథ్‌లు గెలిచినా..ప్రజల పక్షాన నిలవాల్సిన వీరంతా అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజలను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు అమర్ నారాయణ, తంబళ్లపల్లె జనసేన నాయకులు మల్లికార్జున, నరసింహులు, మదనపల్లె నియోజకవర్గ నాయకుడు సందీప్‌రెడ్డి, జగదీష్, చిరంజీవి, శంకర్, అప్సర్, మనోజ్, దేవేంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మార్పుతోనే వివక్షను పారదోలవచ్చు

● సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్

మదనపల్లెటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగి సమాజంలో మార్పు వచ్చినప్పుడే కుల వివక్షతను పారదోలవచ్చని తిరుపతి సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తిరుపతి సీఐడీ పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. సీఐడీ డీఎస్పీ మాట్లాడుతూ చదువుతో స్నేహాన్ని పెంచుకుంటే కుల, మతాలనే అంతరాలుండవన్నారు. పట్టణాలు, నగరాల్లో ఈ అంతరాలు చాలా తగ్గాయని, కేవలం గ్రామాల్లోనే అంటరానితనం అక్కడక్కడ చోటుచేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో 1997లో పుల్లయ్య కమిషన్ ఏర్పాటు చేశాక ఎస్సీ, ఎస్టీల మీద జరిగిన అరాచకాల పట్ల నివేదికలు అందించారని, ఆయన ప్రతిపాదించిన 18 అంశాలను హోంశాఖ ఆమోదించిదన్నారు. విద్యార్థి దశ నుంచే అందరూ సమానమన్న జాతీయభావన తీసుకురావాలన్నారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు మాట్లాడుతూ కొందరికి ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన లేకపోవడంతో నేరాల్లో కూరుకుపోతున్నారన్నారు. బాధితులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై ఫిర్యాదు ఎలా చేయాలి, చట్ట ప్రకారం బాధితులకు అందే న్యాయం, సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం ఈ చట్టంపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు పలు అంశాలపై పరీక్ష నిర్వహించి ఉత్తమంగా రాసిన ఆరుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, సీఐడీ సీఐ కుళ్లాయప్ప, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ ప్రభాకరరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి జయప్రకాష్, తహసీల్దార్ ఖాజాబీ, డీటీ కుమారి, ఏపీపీ వీరాంజనేయులు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.



బీటీ డిగ్రీ కళాశాలలో జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

మద్యం ముట్టరు.. మాంసం తినరు

● గ్రామంలో పాదరక్షలు వేసుకోరు

● పల్లె ప్రజలందరిదీ ఒకేమాట.. ఒకే బాట

● ఆచారాలన్నీ తూచా తప్పకుండా పాటిస్తున్న పెద్దగొడుగు స్వామి భక్తులు

పెద్దగొడుగు స్వామి ఆలయం





ఎగువమూలపల్లె గ్రామం వ్యూ

గాలివీడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అది ఒక కుగ్రామం. ఆచారాలకు, సంప్రదాయాలకు, కట్టుబాట్లకు నిలయం. ఆ గ్రామంలో 20 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వీరంతా మద్యం ముట్టరు, మాంసం తినరు. మంచం మీద కూర్చోరు. నల్లజీవాలను పోషించరు. ఆ పల్లె ప్రజలందరిదీ ఒకేమాట.. ఒకేబాట. ప్రాచీన సాంప్రదాయాలను, ఆచారాలను తూచా తప్పకుండా పాటిస్తూ జీవనం సాగిస్తున్నారు.

గాలివీడు మండల కేంద్రానికి 6 కి.మీ. దూరంలో ఉన్న తూముకుంట పంచాయతీ ఎగువమూలపల్లెలో ప్రాచీన కాలంలో కొన్ని యుగాల క్రితం నుంచి నోముల బ్రహ్మదేవుడిని పూజించడం ఆచారం. కానీ ఆ దేవుడి పూజారులకు (భత్తలయ్య) ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ఎక్కువ.

కట్టుబాట్లు కట్టుదిట్టం

నోములు బ్రహ్మదేవుడు (పెద్దగొడుగు) స్వామి భక్తులకు పల్లె ప్రజలకు ఆనాటి నుంచి నేటి వరకు కట్టుబాట్లు కట్టుదిట్టంగా పాటిస్తున్నారు. ఆ పల్లె ప్రజలు ఎవరూ చెప్పులు వేసుకుని గ్రామంలోకి వెళ్లరు. పల్లె శివారులో వదిలి వెళతారు. పూజారులు అయితే ఎప్పటికీ చెప్పులు వేసుకోరు. నులకమంచం మీద కూర్చోరు. కోళ్లను, నల్లజీవాలను పోషించరు. ఈత చాపల మీద కూడా నిద్రపోరు. మహిళలు బహిష్టు అయితే 5 రోజుల వరకు ఊరుబయట ఉండాల్సిందే. ఆడపిల్లలు మొదటిసారి అయినప్పుడు 12 రోజులు ఊరుబయట ఉండాల్సిందే. పల్లెలో ఎవరైనా చనిపోయినా కర్మకాండ పూర్తయ్యే వరకు వారి కుటుంబ సభ్యులు ఊరుబయట ఉంటారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే పెద్దగొడుగు స్వామి ఆలయ తలుపులను కూడా 12 రోజుల తర్వాత పురోహితులచే పూజలు చేసిన తర్వాతే తెరుస్తారు. ఇలా కట్టుదిట్టమైన సంప్రదాయాలకు కారణం భయం, భక్తిభావం.



ఊరిబయట వదిలిన చెప్పులు

ప్రాచీన కాలంలో భత్తులయ్య, భక్తలమ్మ అనే ఇరువురు స్వామి భక్తులు ఉండేవారు. భత్తులయ్య సమీపంలోని కొండలోకి తపస్సు కోసం వెళ్లగా ఆయన 7 మంది కుమారులు వివిధ రకాల వ్యాపారాలు కోళ్ల, మంచాలు, నల్లజీవాలు, ఈతాకుల వ్యాపారానికి వెళ్లారని, వీరికి కొన్ని గోవులు కూడా ఉండేవని గ్రామస్తులు తెలిపారు. భక్తలమ్మ పరమ పవిత్రత గల మహిళ అని, ఆమె బహిష్టు సమయంలో ఊరుబయట ఉండాల్సి వచ్చిందని, అలాంటి సమయాల్లో గోవులు (పశువులను) విప్పడానికి, భర్త భత్తులయ్యకు భోజనం వడ్డించడానికి ఎవ్వరూ లేకపోవడంతో గోవులు, భర్త ఆకలితో అలమటిస్తున్నప్పుడు ఆమె ఊరి కట్టుబాట్లను వదిలి గ్రామంలోకి వచ్చిందని తెలిపారు. అనంతరం గ్రామానికి అరిష్టం జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకపక్క భయంతో మరోపక్క భక్తితో గ్రామస్తులు ఉన్నట్లు ప్రజలు తెలిపారు.



పెద్దగొడుగుస్వామికి చెందిన చిగురువనము

కట్టుబాట్లకు కట్టుబడి ఉన్నాం

- పూజారి పెద్దమల్లయ్య



గ్రామస్తులందరూ కట్టుబాట్లకు కట్టుబడి ఉన్నారు. ఎవరూ ఈత చాప, మంచం మీద కూర్చోము, మాసం, మద్యాన్ని సేవించడం, చెప్పులు వేసుకొని తిరగం. మేము భక్తి శ్రద్ధలతో నోములు బ్రహ్మదేవుడు (పెద్దగొడుగు) స్వామిని కొలుస్తాము. ఇప్పటి వరకు కట్టుబాట్లను ఉల్లంఘించలేదు. అలా ఎవరైనా ఉల్లంఘిస్తే అప్పుడే వారి కుటుంబంలో ఏదో ఒకటి జరుగుతూ వస్తున్నది.

ఆచార వ్యవహారాలను పాటిస్తున్నాం

- వీరమ్మ, ఎగువమూలపల్లె, తూముకుంట



పల్లెల్లోని మహిళలందరం ఆనాటి నుంచి ఇప్పటి వరకు ఆచారాలు, సంప్రదాయాలను పాటిస్తున్నాం. అంటు, ముట్టు అయితే అయిదు రోజులు ఊరు బయట ఉంటాము. పెద్దగొడుగు స్వామికి 110 ఎకరాల సిగురువనము కలదు. ఆ వనంలోకి ఎవ్వరము (బహిష్టు) అంటూ అయిన వారము వెళ్లలేదు. చిగురువనంలోని చెట్లను ఎవరూ నరకం. ఆ కట్టెలను ఎవరు తీసుకురారు. ఆ వనాన్ని పవిత్రంగా భావిస్తాము.

రైల్వేకోడూరులో వర్షం

● వీధులు జలమయం ● నేలకూలిన వృక్షం

● రాకపోకలకు అంతరాయం

రైల్వేకోడూరు, నవంబరు 13: (ఆంధ్రజ్యోతి) మండలంలో బుధవారం ఒక మోస్తారు వర్షం కురిసింది. దీంతో రంగనాయకులపేట, కొత్తబజారు, రైల్వేస్టేషన్ రూటు, ధర్మాపురం, సూర్యానగర్, నరసరాంపేట తదితర వీధి రోడ్లు జలమయమయ్యాయి. పాదచారులు పలు ఇక్కట్లు పడ్డారు. మండలంలోని అనంతరాజుపేట ప్రధానదారికి పక్కనే ఉన్న పెద్దవృక్షం వర్షం దెబ్బకు నేలకూలింది. కూలిన వృక్షం ప్రధానదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరాజుపేట సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జున, గ్రామస్తులు కలసి అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని యంత్రాలతో కోయించి కొమ్మలను తొలగించారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.





సూర్యానగర్‌లోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు, (ఇన్‌సెట్లో) రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు

వృత్తే ఇంటిపేరుగా మారింది

● మైలాపురం నరసింహులు అలియాస్ పేపర్ నరసింహులు

● 50 ఏళ్లుగా నడుస్తూనే పేపర్ పంపిణీ

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేస్తున్న వృత్తే ఇంటి పేరుగా మారేంతగా ఆయన పనిలో జీవిస్తున్నారు. ఏదొక పని చేస్తూ జీవనం సాగించేది సాధారణమైనా పనే దైవంగా భావిస్తూ చేస్తున్న వృత్తికి న్యాయం చేయడం చూస్తే ఆయన ఆపనిని ఎంతలా ప్రేమిస్తున్నారో తెలుస్తోంది. పుట్టుకతో తల్లిదండ్రులు పెట్టిన పేరును సైతం మార్చి చేస్తున్న వృత్తి పేరునే ఇంటి పేరుగా పిలిపించుకుంటున్నారు. మైలాపురం నరసింహులు అంటూ పిలిస్తే పలుకరేమోకానీ పేపర్ నరసింహులు అంటూ పిలిస్తే నిద్రలో కూడా పలుకుతారు. సుమారు 50 ఏళ్లగా నడుచుకుంటూనే పేపర్ వేస్తూ తిరిగే ఈయన జీవిత చక్రంలోకి తొంగిచూస్తే...

స్థానిక అలమ్మవారిశాల వీధికి చెందిన 76 ఏళ్ల మైలాపురం నరసింహులు వైశ్యకుటుంబంలో 1948లో పుట్టారు. 1964లో ఓ దుకాణంలో గుమాస్తాగా పనికి చేరారు. 1969లో ఎం లక్ష్మికుమారిని వివాహం చేసుకున్నారు. కుటుంబంలో మనిషి పేరిగే కొద్దీ ఖర్చులు పెరుగుతాయని భావించిన ఆయన దుకాణంలో పనిచేస్తూనే అదనపు ఆదాయం కోసం 1974 నుంచి హిందూ పేపర్‌ను ఇంటింటికీ వెళ్లి పంచడం మొదలెట్టారు. అప్పట్లో సైకిల్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఆ సైకిల్ కూడా నేర్చుకోలేదు, నడుచుకుంటూనే ఇంటింటికీ వెళ్లి పేపర్ వేసేవారు. ఆ తర్వాత ఉదయం పేపర్ కూడా కలిపి పంపిణీ చేసేవారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు హిందూ పేపర్ పంపిణీ చేస్తున్నారు. అప్పట్లో ఊరు చిన్న విస్తీర్ణంలోనే ఉండేది. చుట్టూ నాలుగైదు కిలోమీటర్ల వరకు తిరిగేవారు. ఇపుడు ఊరు బాగా పెరిగింది. సుమారు ఏడెనిమిది కిలోమీటర్లు తిరిగి ఇళ్లవద్దకు వెళ్లి పేపర్ వేయాల్సి వస్తోంది.



మైలాపురం నరసింహులు అలియాస్ పేపర్ నరసింహులు

పట్టణమంతా 13 పేపర్లు వేయాల్సి ఉంటుంది. అయితే ఇంటింటికీ వెళ్లి వేయాల్సి ఉన్నందున ఊరంతా నడుస్తూ వెళ్లాల్సిందే. పేపర్ వేయడం ద్వారా వచ్చే రోజు ఆదాయం రూ.26. కానీ ఇద్దరు పిల్లలకు పెళ్లి చేసి 76ఏళ్లు వచ్చినా ఆదాయం కోసం కాకుండా ఒకహాబీగా పేపర్ పంపిణీ చేయడం అలవాటుగా మారింది. ఏదొక పనితో జీవనం సాగించడం ప్రతి ఒక్కరూ చేస్తున్నా అసలు పేరును సైతం మరచిపోయేలా వారి జీవితం సాగింది. అంతగా ఆ పనిలో వారు తలమునకలై పోయారు. ఆ వృత్తి కుటుంబ పోషణకు ఉపయోగపడుతూ పనిని ఆస్వాదిస్తూ చేయడం ఆయన దైనందిన జీవితంలో ఒక్కటై పోయింది. ఓపిక ఉన్నంత వరకు ఇలా నడుస్తూనే పేపర్ వేయడం దైనందిన జీవితంలో అలవాటుగా మారిపోయిందని పేపర్ నరసంహులు చెబు తున్నాడు. ఇప్పుడిప్పుడే ఓపిక తగ్గుతోంది. ఓపిక ఉన్నంత వరకు చేస్తాను అని ఆనందంగా చెప్పారాయన.





ఇళ్లకు, షాపులకు పేపర్ పంపిణీ చేస్తున్న నరసింహులు

సామరస్యంగా ఎన్నికలు జరిగేలా చర్యలు

● జిల్లాలో 167 చెరువులకు సాగునీటి ఎన్నికలు


● ఎన్నికల శిక్షణ సమావేశంలో అధికారుల స్పష్టీకరణ

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి ఎన్నికలు సామరస్య వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఆర్డీవో రాఘవేంద్ర సూచించారు. స్థానిక మున్సిపల్ టౌన్ హాలులో బుధవారం మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమించిన ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 3276 చెరువులు ఉన్నాయన్నారు. ఇందులో వంద ఎకరాలు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణం (సాగు) గల 167 చెరువులకు సాగునీటి తీరువా ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు. తప్పనిసరైతే తప్ప ఎన్నికలకు వెళ్లకూడదని, సెలక్షన్ స్థాయిలోనే సరిపెట్టేలా చూడాలని సూచించారు. సాగునీటి సంఘాలకు ఈనెల 20న నోటిఫికేషన్ విడుదల చేసి, 23వ తేదీ ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారం, పది రోజులు రీషెడ్యూల్ చేసే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్ ఈఈ, మాస్టర్ ట్రైనర్ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో సర్పంచి, వార్డు సభ్యునికి పోటీ చేయడానికి ఉండే అర్హతతో పాటు సాగునీటి సంఘం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థికి అదనంగా కనీసం 1432 పసలీ వరకు సాగునీటి తీరువా చెల్లించి ఉండాలని స్పష్టం చేశారు. రాయచోటి ఆర్డీవో, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్నికల అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 167 చెరువుల కింద గల సాగునీటి ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలశాఖ, అంగన్‌వాడీ, తదితర విభాగాలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు. ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపై మదనపల్లె ఆర్డీవోతో పాటు ఇద్దరు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌లో తండ్రీ కొడుకులకు ఐదేళ్ల జైలు

● రూ.6 లక్షల జరిమానా విధించిన న్యాయమూర్తి

రేణిగుంట/మంగళం/రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన తండ్రీ కొడుకులకు ఎర్రచందనం కేసులప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధించారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్సు అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి బీటు కృష్ణాపురం సెక్షన్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం సిరివరం గ్రామానికి చెందిన తండ్రి తోట చిన్న చెంగయ్య, కుమారుడు చెంగయ్య పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరిద్దరిపై 2019, 2022 సంవత్సరాల్లో కేసులను నమోదు చేశామన్నారు. ఇంత కాలంగా కొనసాగుతున్న విచారణలో వీరిని దోషులుగా గుర్తించి ఆర్ఎస్ఎస్ ఏడీజే న్యాయస్థాన న్యాయమూర్తి నరసింహమూర్తి తండ్రీ కొడుకులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారన్నారు. శిక్ష పడిన వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. ఈ తీర్పు ఎర్రచందనం స్మగ్లర్లకు ఒక హెచ్చరికగా పనిచేస్తుందన్నారు.



తోట చిన్న గంగయ్య, చెంగయ్య

11 మంది ఐసీడీఎస్ ఉద్యోగులపై విచారణ

● పులివెందుల పూర్వ సీడీపీవో సావిత్రితో సహా

● 10 మంది సూపర్‌వైజర్లపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాజెక్టుకు గతంలో సీడీపీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన జి.సావిత్రితో సహా మరో 10 మంది సూపర్‌వైజర్లపై కూడా ఈ విచారణ కొనసాగనుంది. ఇందులో ఒక సూపర్‌వైజర్ మరణించడంతో ఆమెను మినహాయించాలని కూడా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రూ.8,71,862లు విలువైన బియ్యం, పప్పులు, ఆయిల్ వంటి ఎస్ఎన్‌పీ ఆహార పదార్థాలు దుర్వినియోగం జరిగినట్లు 2017లో గుర్తించారు. ఈ విషయాన్ని శాఖాపరమైన విచారణలో నిర్ధారణ కావడంతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనరు 2017 జూలై 24న ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి సంజాయిషీ నోటీసులిచ్చి విచారణ కొనసాగిస్తూ వచ్చారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ విచారణ ఐదేళ్లపాటు మరుగున పడింది. తాజాగా పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సమగ్రంగా విచారణ జరపడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా పనిచేసి రిటైర్డ్ అయిన జి.సావిత్రి, అదే విధంగా రిటైర్డ్ అయిన సూపర్‌వైజర్లు జె.ఎమిలియా, బి.రామానుజమ్మ, ఎం.రత్నకుమారితో పాటు ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతున్న సూపర్‌వైజర్లు కె.భారతి, వై.వి.రమణమ్మ, జి.లక్ష్మీదేవి, జె.వరలక్ష్మి, సరస్వతమ్మలపై పూర్తి విచారణకు ఆదేశించారు. వీరు కాకుండా మరణించిన మరో ఇద్దరు సూపర్‌వైజర్లు వెంకటసుబ్బమ్మ, సి.చెన్నమ్మలను విచారణ నుంచి మినహాయించాలని కూడా పేర్కొన్నారు. ఇందుకు కడప ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసరును విచారణాధికారిగా నియమించారు. విచారణాధికారికి అవసరమైన రికార్డులను సేకరించి అందుబాటులో వుంచేందుకు ప్రెజెంటింగ్ అధికారిగా పులివెందుల ప్రస్తుత సీడీపీవోను కూడా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మహిళ, శిశు, ప్రత్యేక ప్రతిభావంతులు, వయోజనుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మ కాపు..ఉఫ్

- అన్ సీజన్‌లో రుమాని మామిడి కాపు
- దెబ్బతీసిన మంగు.. డీలా పడ్డ రైతులు
- దిగుబడులు వచ్చినా కానరాని ధరలు
- టన్ను రూ.10వేలు పలుకుతున్న వైనం
- లోకల్ మార్కెట్‌లో విక్రయాలు

రైల్వేకోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ సీజన్‌లో రుమాని రకం మామిడి కాపునిచ్చింది. రైతన్నలు మంచి ధరలు పలుకుతాయని సంతోషపడ్డారు. అయితే వారి ఆశలను ఆవిరిచేస్తూ వర్షం రూపంలో దెబ్బతీసింది. తరచూ వర్షం కురవటంతో కాయలకు మంగు ఏర్పడింది. దీంతో మామిడి కాయలను జాతీయ మార్కెట్‌లో అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో రైతులు డీలా పడ్డారు. లోకల్ మార్కె ట్‌లో అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లం పేట, పెనగలూరు, ఓబుల వారిపల్లె మండ లాల్లో ఎండవేడిమికి ఈ సారి రుమాని ఉమ్మకాపు బాగా వచ్చింది. కాయలు కొన్నిచోట్ల మాత్ర మే మంగు లేకుండా దిగుబడులు వచ్చాయి. దీంతో కొందరు ముంద స్తుగానే పచ్చళ్లకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. ఢిల్లీ, ముంబాయ్ నగరాల్లో ఉన్న మార్కెట్‌లోకి కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మంగులేని మామిడి కాయలు రావ డంతో రైల్వేకోడూరు కాయలకు డిమాం డు తగ్గిపోయింది. దీంతో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, తిరుపతి, కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల మార్కెట్‌కు రైతులు తరలిస్తున్నారు. టన్ను రూ.10వేలు చెప్పున విక్రయాలు సాగుతున్నాయి.



రైల్వేకోడూరులో కాసిన రుమాని మామిడి కాయలు



శెట్టిగుంట వద్ద పూత దశలో ఉన్న మామిడి చెట్లు

రైల్వేకోడూరు నుంచి ఇతర రాష్ట్రాలకు 4 నుంచి 5 లోడ్ల వరకు కాయలు ఎగమతి చేశారు. మంగు రాకపోయి ఉంటే చాలా మంది రైతులు మంచి లాభాలు గడించేవారు. గత నెల నుంచి రుమాని మామిడి కాయలు కోతలు ప్రారంభమయ్యాయి. తమిళ నాడులోని క్రిష్ణగిరి, దిండిగల్, కేరళలోని పాల్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో రైతులు కల్తార్ మందులు ఉపయోగించడంతో రుమాని, తోతాపూరి కాపునిచ్చింది. ప్రస్తుతం అన్ని రకాల మామిడి చెట్లకు ముంద స్తుగానే పూతలు వస్తున్నా వర్షం దెబ్బకు మగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంగు దెబ్బతీసింది



రుమాని మామిడి కాయలకు మంగు దెబ్బతీసింది. మార్కెట్‌లో ఎప్పటికి మామిడికి డిమాండ్ ఉంటుంది. అన్ సీజన్‌లో ఎక్కువగా నీలం, పునాసా, అల్లీపసందు మామిడి కాయలు మాత్ర మే వస్తున్నాయి. అయితే ఈ ఏడాది రుమాణి రకం అన్ సీజన్‌లో కాపు కాయడంతో సంతోషపడ్డాం. అయితే మంగు రావడంతో ఫలితం లేకుండా పోయింది.

-కస్తూరి రామచంద్రనాయుడు, రైతు, రైల్వేకోడూరు

వ్యాపారం బాగుంటుందని అనుకున్నాం



రుమాని మామిడి కాయలు కాపునిచ్చా యని.. వ్యాపారం బాగా ఉంటుందని అనుకున్నాం. అయితే కాయలకు మం గు రావడంతో వ్యాపారం లేకుండా పోయింది. కొందరి రైతుల తోటల్లోనే కాయలకు మంగు లేదు. వాటిని కొద్దిగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశాం.

-తిమ్మిశెట్టిపల్లి మణి, మామిడి వ్యాపారి

సాధారణంగా మామిడి డిసెంబరు మాసంలో పూతలు వచ్చి మార్చి నెలాఖరకు కాయలు మార్కెట్‌లోకి వస్తాయి. జూన్ ఆఖరి కల్లా మామిడి సీజన్ పూర్తి అవుతుంది. సీజన్ తర్వాత నీలం రకం మామిడి మాత్రమే ఉమ్మ కాపు వస్తుంది. సెప్టెంబరు నెలాఖరు వరకు ఉమ్మకాపు కాయలు మార్కెట్‌లో లభిస్తాయి. తర్వాత అల్లీపసందు మామిడి కూడా ఉమ్మకాపునిస్తుంది. ఇది ఎక్కువగా వినియోగ దారు లు ఊరగాయకు ఉపయోగిస్తారు. నీలం తర్వాత పునాసా మామిడి ఏడాదికి రెండు సార్లు కాపు నిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఈ నెలలో తొలిసారిగా రైల్వేకోడూరు ప్రాంతంలో రుమాణి ఉమ్మకాపు నిచ్చింది. గతంలో ఒక్కసారి తోతాపూరి కాయలు మాత్రమే ఉమ్మ కాపు నిచ్చాయి. వాతావరణ పరిస్థితుల్లో ఎక్కువగా మార్పులు రావడంతోనే ఇలా జరుగుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



గండిలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల పూజా కార్యక్రమాలు

చక్రాయపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రంలో పవితోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రెండో రోజు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బ య్య పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు ఉదయం వేద దివ్య ప్రబంధ పారాయణాలతో ప్రారంభించారు. ద్వార తోరణ పూజ, సోమకుంభ ప్రతిష్ఠ, మహా కుంభారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, మూలమత్ర వాహనం, స్నపన తిరుమనం, పవిత్రో ప్రతిష్ఠ, ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. సాయంత్రం చతుఃస్థానార్చన, వేద ప్రబంధ పారాయణాలు, త్రికాల ఆరాధన, సుందరకాండ పారాయణం, హోమం లఘుపూర్ణాహుతి, నివేదన, శాత్తుముర్రై, గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కడప(వినాయకనగర్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రసన్నకుమారి, పల్లవి జాతీయస్థాయి అండర్-18 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ అరుణకుమారి తెలిపారు. డిసెంబరు 11 నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్ఎస్ఎస్ అధికారి గోవిందరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు సస్పెన్షన్



సుండుపల్లె జడ్పీ హైస్కూల్‌లో డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

సుండుపల్లె/రాయచోటి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన తెలుగు ఉపాధ్యాయుడు లోకేశ్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం బుధవారం రాత్రి ప్రకటించారు. 8వ తరగతి విద్యార్థి విఘ్నేష్‌ను ఉపాధ్యాయుడు కొట్టినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఆయన వివరించారు. అంతకుముందు రాయచోటి డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన సంఘటనపై విచారణ నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యా యులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిని మందలించారు. మండల విద్యాశాఖ అధికారులు వెంక టేశ్ నాయక్, రవీంద్రనాయక్, హెడ్మాస్టర్ పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లుంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు అని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు, రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నిత్యం విమర్శించేవన్నారు. ప్రస్తుతం చంద్రబాబు, మోదీ ప్రభుత్వాలు అంతకుమించి అప్పులు చేస్తున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 7 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం రూ.59వేల కోట్లు అప్పు చేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్స రంలో రూ.91,443 కోట్ల అప్పు చేస్తామని బడ్జెట్‌లోనే చూపించారన్నారు. 1947 నుంచి 2014 వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం 47లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందన్నారు. 2014 నుంచి 2024 వరకు మోదీ ప్రభుత్వం అదనంగా రూ.122 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీకి 15 మంది విప్‌లను ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతమంది విప్‌లు లేరని తులసిరెడ్డి అన్నారు.

చెరువు కట్టను పరిశీలించిన డ్వామా పీడీ



కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు వద్ద ఫిర్యాదు దారుడితో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పెద్దతిప్పసముద్రం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్టను బుధవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ మధుబాబు, ఉపాధి హామీ ఏపీవో తిరుపాలప్పతో కలిసి పరిశీలించారు. ఇటీవల కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్టపై గుట్టలో వెలసిన నరసింహస్వామి ఆలయం వద్దకు రోడ్డు వేయాలని కందుకూరుకు చెందిన రవిస్వామి అనే వ్యక్తి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలతో పాటు కలెక్టర్‌కు లేఖ రాయడంతో స్పందించిన అధికారులు బుధవారం కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్ట వద్దకు చేరుకుని ఫిర్యాదుదారుడితో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసి పనులను ప్రారంభించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఉపాధి సిబ్బందిని పీడీ ఆదేశించారు. చెరువులో నీరు అయిపోగానే ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడికతీత పనులను చేపట్టవచ్చని తెలిపారు ఆయన వెంట ఏపీడీ మధుబాబు, ఏపీవో తిరుపాలప్ప, ఉపాధి హామీ జేఈ మహేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, కదిరప్ప ఉన్నారు.

రూ.473 కోట్లతో హంద్రీ-నీవా కాలువ మరమ్మతు పనులు ప్రారంభం



బి.కొత్తకోట శివారులో హంద్రీ-నీవా కాలవ పనులు చేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు రూ.473 కోట్లతో పనులు చేపట్టారు. బి.కొత్తకోట-పీటీఎం మండలాల సరిహద్దులో రెండు రోజులుగా పనులు ప్రారంభమయ్యాయి. ఎక్స్‌కవేటర్లతో జంగిల్ క్లియరెన్స్, కాలువ గోడలకు మరమ్మతు పనులు చేస్తున్నారు. కాలువ విస్తరణ పనులు ప్రస్తుతానికి వాయిదా పడటంతో ఉన్న కాలువలోనే నీటిని కుప్పం వైపునకు తరలించేవిధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పీటీఎం నుంచి 132 కి.మీ మేర పనులు పూర్తి చేయనున్నారు. సత్యసాయి జిల్లా చెర్లోపల్లె రిజర్వాయరు నుంచి పీటీఎం, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు మీదుగా కుప్పంకు వచ్చే ఏడాది మే నెలకు నీటిని తరలించే లక్ష్యంతో పనులు చేపట్టినట్లు హంద్రీనీవా ఎస్ఈ రాజగోపాల్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలి

- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప మారుతీనగర్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా పాలక ప్రభు త్వాలు త్వరితగతిన ఆర్డినెన్స్ జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాటాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలకు రాజ్యాంగపరమైన ఎస్సీ రిజర్వే షన్‌లో సరైనరీతిగా న్యాయం జరగలేదన్నారు. ఈనెల 11 నుంచి జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశా లలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలపాలని కోరు తూ గతంలో రామచంద్ర కమిషన్ ఎస్సీ జాబితాలోని 59 ఉపకులాలను ఏబీసీడీగా వర్గీకరించి కులాల వారీగా రిజర్వేషన్‌ల పంపిణీ జరిగిందన్నారు. ప్రస్తుతం పాలక ప్రభుత్వాలు రిజర్వే షన్‌లను మూడు కేటగిరీలుగా ఏబీసీ చేయాలని జిల్లా యూనిట్‌గా తీసుకు న్నందుకు దళిత ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి తెలియపరచారన్నారు. ఏది ఏమైనా షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు అడ్డంకులు లేకుండా రాజ్యాంగంలోని 9వ షెడ్యూ ల్డ్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం ద్వారా శాశ్వత పరిష్కారం సులువు అవుతుందన్నారు. ఆదిశగా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా చూడాలన్నారు. కాగా, నిరసన కార్యక్రమానికి ముందు దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి.. అక్క డ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకు న్నారు. డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, సమితి రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు బాలలక్ష్మ య్య, కర్ణ, రమాదేవి, అంజనమ్మ, సుబ్బ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయండి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప ఎన్జీఆర్ సర్కిల్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ చాంబర్‌లో 71వ అఖిలభారత సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 14న సహకార మంత్రిత్వశాఖ కొత్త కార్యక్రమాల ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేసే కార్యకమాలు, 15న సహకార సంఘాలతో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన కార్యక్రమాలు, 16న వ్యవ స్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర కార్యక్రమాలు, 17న సహకార సంస్థలు వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించు కార్యక్రమాలు, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కొరకు సహకార సంఘాలు కార్యక్రమాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో సహకర సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీవో జి.సుభాషిణి, డీసీఈ బ్యాంకు సీఈవోపీ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



ప్రొద్దుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ తాత్కాలిక కురగాయల మార్కెట్ వద్ద పెద్దమ్మగుడి పేరుతో మున్సిపల్ స్థలం ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంపై హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు కమిషనర్ మల్లికార్జున, ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్‌లు భారీ పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ స్థలంలో కట్టిన తాత్కాలిక షెడ్లు, బంకులు ఎక్స్‌వేటర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ స్థలం ఆక్రమించి కట్టిన పెద్దమ్మఆలయంతో పాటు ఇతర తాత్కాలిక కట్టడాలు, షెడ్లు, బంకులు తొలగించాలని గత కమిషనర్, ఏసీపీ నోటీసులు ఇచ్చారన్నారు. ఆ నోటీసులపై ఆక్రమణ చేసిన సుధాకర్ అనే వ్యక్తి హైకోర్టుకు వెళ్లాడన్నారు. హైకోర్టు కొంత సమయం ఇచ్చి విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అందులో బాగంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ స్థలం పూర్తి రికార్డులు పరిశీలించి అది మున్సిపాలిటీదిగా ధ్రువీకరించారన్నారు. అలాగే సదరు వ్యక్తి పెద్దమ్మ ఆలయం పేరుతో ఆలయం చుట్టూ వున్న స్థలంలో తాత్కాలిక షెడ్లు నిర్మించారు. వాటిని అద్దెలకు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఆమేరకు హైకోర్టుకు నివేదిక ఇచ్చామన్నారు. ఆతరువాత సదరు ఆక్రమణ దారునికి నోటీసులు ఇచ్చినా స్పందించని కారణంగా పోలీసు బందోబస్తు సహకారంతో తొలగించామన్నారు.

వివాదాస్పద వసతి గృహ కాంపౌండ్ తొలగింపు



కాంపౌండ్‌ను తొలగించిన దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నడింపల్లెలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం కాంపౌండ్ తొలగింపు వివాదాస్పదంగా మారింది. వసతి గృహంలో రెండు హాస్టళ్లతోపాటు ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయం ఉంది. హాస్టల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నడింపల్లె మున్సిపల్ హైస్కూలు విద్యార్థుల కోసం నాడు-నేడు పనుల ద్వారా మూడు తరగతి గదులు నిర్మించారు. ఆ తరగతి గదులకు హాస్టల్‌లో నుంచి వెళ్లడానికి తగిన ఏర్పాటు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కోరారు. వసతి గృహాన్ని పరిశీలించి కాంపౌండ్ వాల్ తొలగించి గేటు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అయితే సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల అనుమతి లేకుండానే కాంపౌండ్ వాల్‌ను తొలగించారు. గేటు ఏర్పాటు చేయడానికైతే కాంపౌండ్‌వాల్‌ను పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఏముందని హాస్టల్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. కాంపౌండ్‌ను తొలగించడం వలన హాస్టల్ విద్యార్థులకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాలువ పూడిపోవడం వలన హాస్టల్‌లోని మురికినీరు అసలే నిలుస్తోందన్నారు. కాంపౌండ్ తొలగింపుపై హాస్టల్ అధికారులు ఏఎస్‌డబ్ల్యూవో, సాంఘిక సంక్షేమశాఖ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా కాంపౌండ్ తొలగింపుపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. కాంపౌండ్ తొలగింపుపై కలెక్టర్‌కు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళుతామని, తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ఓబులేసు, బాస్కర్, చెన్నమ్మ, ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు.

డిసెంబరు 15 లోపు ప్రీమియం చెల్లించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

రామాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ పంటలకు డిసెంబరు 15 లోపు బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయఅధికారి చంద్రానాయక్ రైతులకు సూచించారు. మండలంలోని హసనాపురం, చిట్లూరు రైతు సేవా కేంద్రాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ వరి పైరుకు ఎకరానికి రూ.126, వేరుశనగకు ఎకరానికి రూ.96 ప్రీమియం చెల్లిస్తే రూ.42 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఈ అవకాశం రైతులు వినియోగించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. కొత్తరకం వంగడాలతో తెగుళ్లను నివారించవచ్చునన్నారు. ఈ సమావేశంలో లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికారి వై. నాగమణి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వైఖరిపై నిరసన


రాజంపేట డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డ్యూటీ చార్టు వేయడంలో రాజంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ మాధవీలత అవకతవకలకు పాల్పడుతూ వేధిస్తున్నారంటూ జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బీసీ శేఖర్ ఆధ్వర్యంలో రాజంపేట ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం డ్రైవర్లు, కండక్టర్లు ఆందోళన చేశారు. అన్ని అసోసియేషన్ల ఉద్యోగులను సమానంగా చూడాల్సిన అసిస్టెంట్ మేనేజర్ వైసీపీ అనుబంధాల సంఘాలకు అనుకూలంగా పని చేస్తున్నారన్నారు. సెలవుల మంజూరులో పక్షపాతం చూపుతున్నారన్నారు. వైసీపీకి అనుకూలంగా పని చేస్తూ కార్మికులను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చలపతి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, డిపో కార్యదర్శి మౌలా, గ్యారేజి కార్యదర్శి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక' అమలులో.. అధికారులకు చుక్కెదురు


గ్రామస్థులకు సర్ధిచెబుతున్న పోలీసులు

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానం అమలుకు చర్యలు తీసుకోండి అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన మండల ఆర్ఐ నరసింహ ప్రసాద్, వీఆర్వో కేశవులు బుధవారం జంగాలపల్లె పెన్నానది లోనికి వెళ్లే దారికి అడ్డంగా తీసిన గోతులు పూడ్చేందుకు కూలీలను తీసుకుని వెళ్లగా వారిని గ్రామస్థులు అడుకున్నారు. ఉచిత ఇసుక విధానం అమలును అడ్డుకోవడం తగదని అధికారులు ప్రజలకు తెలియజేసినా వారు వినకపోవడంతో స్థానిక పోలీసులు రంగప్రవేశం చేసి సర్ది చెప్పారు. ఈ విషయంపై మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత మాట్లాడుతూ పెన్నానది నుంచి గృహనిర్మాణాలకు ఇసుక తీసుకువెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో తనిఖీలు

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలంలోని బొగ్గుడివారిపల్లె, పెద్దపల్లె రైతుసేవా కేంద్రాలను బుధవారం ఉదయం వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు తనిఖీ చేశారు. డ్రిప్ ఇరిగేషన్ కోసం రిజిస్ట్రేషన్, పరికరాల సరఫరా వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైతులకు రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఖాళీ భూములు, సర్వేనంబర్లు మ్యాప్ చేసి పంట సాగు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతుసేవా కేంద్రం సహాయకులు సందీప్‌సింహ యాదవ్, ప్రేమ్‌సందీప్, రైతులు ఎల్లారెడ్డి, సుబ్బారెడ్డి, శీనయ్య, వీరన్నల రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ రాయుడు మృతి.. ఉద్యమాలకు తీరని లోటు

రాజంపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ సీనియర్ నాయకుడు, జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు మృతి కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు., బుధవారం పట్టణంలోని కళాంజలి కళ్యాణ మండపంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు ముందుగా కార్మిక సంఘాల నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారసీపీఐ నేతలు ఎం.శివరాంకృష్ణదేవర, పీఎల్ నరసింహులు, చిట్వేలి రవికుమార్, టీడీపీ నేతలు మల్లెల శ్రీవాణి, ఇడిమడకల కుమార్, విశ్రాంత తహసీల్దారు రమణ, జనసేన నాయకులు నాసిర్‌ఖాన్, కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పూర్తయ్యేదెన్నడో?

● నిధుల దుర్వినియోగం ● ఆగిన అంగన్వాడీ భవనాల నిర్మాణం


ఆగిపోయిన శెట్టిపల్లె-2 అంగన్వాడీ భవన నిర్మాణం

సంబేపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిధులు మంజూరై రెండేళ్లైనా మండలంలోని అంగన్‌వాడీ భవనాల నిర్మాణం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. నిధులు దుర్వినియోగమయ్యాయన్న ఆరోపణల నేపథ్యంలో నిలిచిపోయిన పనులు కూటమి ప్రభుత్వంలోనైనా ప్రారంభం కాకపోవడంతో పలు చోట్ల ఇప్పటికీ అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

నాడు-నేడు పథకం కింద 2022లో సంబేపల్లె మండలంలోని వివిధ ప్రాంతాల్లో 17 అంగన్వాడీ భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 13.20 లక్షలు కేటాయించింది. అయితే, ఈ భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. అంగన్వాడీ భవనాల నిర్మాణంలో నిధులు దుర్వినియోగం అయ్యాయన్న అభియోగాల నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వంలో కూడా పనులు కొనసాగడం లేదు. దీంతో చాలా చోట్ల అంగన్వాడీ కేంద్రాలు ప్రైవేటు భవనాల్లోనే నిర్వహిస్తున్నారు.

వివిధ దశల్లో ఆగిన పనులు

బొగ్గులవారిపల్లె, గాండ్లపల్లి రోడ్డు భవనాలు మౌల్డింగ్ దశలో ఉన్నాయి. భట్టువాండ్లపల్లి, దొడ్డిసిద్దయ్యగారిపల్లె, శెట్టిపల్లె-2, గుదియవాండ్లపల్లి, బావులకాడపల్లె, అగ్రహారం, దేవళంపేట, ఎస్. సోమవరం కేంద్రాలు పునాది దశలోనే నిలిపేశారు. నిధులు లేక కొన్ని చోట్ల సిమెంటు, స్టీలు లేక మరి కొన్ని చోట్ల పనులు జరగలేదు. దీంతో భవనాల నిర్మాణం కోసం కేటాయించిన సామగ్రి దుర్వినియోగం అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. బావులకాడపల్లి, గుదియవాళ్లపల్లె, దేవళంపేటలో చేసిన పనికన్నా ఎక్కువ బిల్లులు చెల్లించినట్టు ఫిర్యాదులు అందాయి. సీపీయం కేంద్రం ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి కిటికీలు, డోర్లు, సిమెంటు, రంగులు, ఎలక్ట్రికల్ సామగ్రి సరఫరా చేసింది. కొంత మంది కాంట్రాక్టర్లు పనులు తక్కువ చేసి ఎక్కువ బిల్లులు తీసుకొని పనులు వదిలేశారని ఆరోపిస్తున్నారు.


బావులకాడపల్లెలో పునాది దశలోనే..

పనులు పూర్తి చేయాలి



భవనాల నిర్మాణాలు ఆగిపోవడంతో సామగ్రి దుర్వినియోగం అవుతోంది. ఆగిన భవనాల నిర్మాణాలను పరిశీలించి పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలి. నిధులు దుర్వినియోగమైన చోట విచారణ చేయాలి.

- హేమంత్, సంబేపల్లె

పనులే జరగడం లేదు



అంగన్వాడీ కేంద్రాల భవనాల పనులు ఆగిపోయాయి. కొన్నిచోట్ల నిధులు లేవు. కొన్ని చోట్ల సామగ్రి సర ఫరా చేయలేదు. చాలా ప్రాంతాల్లో సామగ్రి దుర్వినియోగం అవుతోంది. భవన నిర్మాణానికి కావాల్సిన సామగ్రి సరఫరా చేసి పూర్తి చేయాలి.

- శ్రీనివాసులు, ఎంఈవో సంబేపల్లె

ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


నందలూరు: సర్వేరాళ్లపై చిత్రాలు తొలగించడాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాజంపేట/నందలూరు, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. బుధవారం రాజంపేట నందలూరు మండల కార్యాలయాల్లో మండల అభివృద్ధికై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అత్యంత ప్రాధాన్యమిచ్చి చట్ట పరిధిలో వేగవంతంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి అందిన అర్జీలపై తక్షణం స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. పిటిషన్‌దారులతో తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వోలు మాట్లాడాలన్నారు. ఏదైనా అంశంలో నోటీసు ఇవ్వాలనుకుంటే చట్టప్రకారం నోటీసు ఇచ్చి గడువు దాటిన వెంటనే దానిని పరిష్కరించాలన్నారు. చుక్కల భూములు, ఇనాం భూములు, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ పారదర్శకంగా చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమస్య పరిష్కారమవుతుందన్నారు. గృహ నిర్మాణాల ప్రగతిపై రెండురోజుల కొకసారి సమీక్షించాలన్నారు. ఇంటి నిర్మాణాల్లో ఆర్థిక సమస్యలు ఉంటే మహిళా సంఘాలతో వారికి రుణాలు ఇప్పించాలన్నారు. ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇసుక రీచ్‌లో యంత్రాలు, జేసీబీలు పెడితే వాటిని సీజ్ చేసి అధిక మొత్తంలో జరిమానా వేయాలన్నారు. పల్లెపండుగలో చేపట్టిన పనులన్నింటినీ వందశాతం పూర్తి చేయాలన్నారు. సర్వేరాళ్లపై ఉన్న బొమ్మలు, అక్షరాలను తొలగించాలన్నారు. రాజంపేట మండల అభివృద్ధిపై అధికారులందరూ సమష్టిగా పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో లీలారాణి, సర్వే ఏడీ భరత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేయాలి

శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్ల భవనాలకు మరమ్మతులు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, సూర్యవర్ధన్ తదితరులు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్ల భవనా లన్నీ పాడైపోవడంతో వర్షానికి ఉరుస్తున్నాయి, కిటికీలు, తలుపులు కూడా లేని విన్నవించారు. వెంటనే వాటికి మరమ్మతులు చేయాలని కోరారు.

సౌమ్యనాథస్వామి సన్నిధిలో కలెక్టర్

నందలూరు: నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయాన్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్ దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. టీడీపీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి కలెక్టర్‌ను పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలపాలి : సుగవాసి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సుగవాసి బాలసుబ్రమణ్యం

నందలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో రాజంపేట నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం కుంపిణీపురం ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించిన అనంతరం నూకినేనిపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రాజంపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మంచానికే పరిమితైన వ్యక్తికి టీడీపీ సభ్యత్వం

సిద్దవటం: మండలంలోని మలినేనిపట్నానికి చెందిన సిద్దయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. అప్పటి నుంచి స్వచ్ఛంద సంస్థలు ఆయనను ఆదుకుంటున్నాయి. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కాడే చెంచయ్యనాయుడు బుధవారం రాత్రి గ్రామానికి చేరుకుని ఆ వ్యక్తికి టీడీపీ సభ్యత్వంతో పాటు, 5 వేలు ఆర్థిక సాయం అందించారు.

దైవభక్తి కలిగి ఉండాలి

సుండుపల్లె: ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ కటారు ముడుకులో వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ రాజమ్మ కూటమి నాయకులు, గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

రాయచోటిటౌన్,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం వారు రాయచోటి పట్టణంలోని మాసాపేట బ్రిడ్జి సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు గడిచినా 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. పీఎఫ్ బకాయిలను ఖాతాల్లో జమచేయని అరబిందో యాజమాన్యంపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలన్నారు. ఇక నుంచి 104 సర్వీసును ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. 104 వాహనాల డ్రైవర్లకు రూ.25 లక్షలు ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వాహన మురమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్ బకాయిలను చెల్లించాలని కోరారు.

సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెలాఖరు నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు నాగిరెడ్డి, వినయ్‌లతో పాటు సీఐటీయూ కార్యదర్శి రామాంజులు, మాధవ, బాలకృష్ణంరాజు, నాగార్జున, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూత, పిందె దశలో సస్యరక్షణతో మామిడిలో మంచి దిగుబడులు


మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మామిడిలో పూత పిందె దశలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యాన శాఖ అధికారి నాగమణి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పందిళ్లపల్లె, కుర్నూతల గ్రామాల్లో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో మొగ్గ దశలో తేనెమంచు పురుగు, మసితెగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే ఎక్కువ అవకాశాలున్నాయని, మోనోక్రోటోఫాస్ పిచికారీ చేసి ఆయా తెగుళ్లను నివారించవచ్చన్నారు. పిందె బఠాణి గింజ సైజులో ఉన్నప్పుడు తేనెమంచు పురుగు, తామరపురుగు ఆశిస్తాయన్నారు. ఏఓ రమేష్‌బాబురావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుకు భూమి దుక్కులు చేసి సారవంతమైన ఎరువులు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కెరోలిన్ అనూష, రైతు కేంద్రం సహాయకులు కీర్తి, రమేష్ రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేయించుకోవాలి

రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రంలో పంట వివరాలు నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖాధికారి జి. సుధాకర్, ఉద్యానశాఖాధికారి ఎం. భాస్కర్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని నారాయణరాజుపోడు, బొజ్జావారిపల్లెల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియం చెల్లించి బీమా సదుపాయం పొందాలన్నారు. జిల్లాలో వరి, వేరుశెనగ, టమోటా పంటలకి రబీ సీజన్‌లో 2024-25కు బీమా వర్తిస్తుందన్నారు.

ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌కు సన్మానం


ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్‌ను సన్మానిస్తున్న ముద్రపల్లె, కాకర్లవారిపల్లె నాయకులు

పెనగలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు ప్రభుత్వవిప్ పదవి పై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ముద్రపల్లె, కాకర్లవారిపల్లె గ్రామాల టీడీపీ నాయకులు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించినట్లు మండలస్థాయి నాయకులు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సుండుపల్లె విద్యార్థిని

సుండుపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పల్లవి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న బుధవారం తెలిపారు. రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె విశేష ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించండి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలలు, మహిళా సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కేటాయించిన టోల్‌ఫ్రీ నంబర్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సీడీపీవో పద్మావతి తెలిపారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద టోల్ ఫ్రీ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో 108, 100, 112. 104, 101, 1906, 1930 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో గోడ పత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దాద్‌బీ, తులసమ్మ, లక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, రుక్మిణి, శిరీష పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెరగాలి


సుగవాసి ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న మాసాపేట రెడ్డివారిపల్లె వాసులు

రాయచోటిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెరగాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం ఆయన స్థానిక రెడ్డివారిపల్లె సీతారామాలయం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు చేశారు. గ్రామ నేతలు చెంగల్‌రాయుడు, కొట్టే శేఖర్, రాము, సత్య, గిరి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ తల్లికి నివాళి

పెమ్మాడపల్లి హరిజనవాడకు చెందిన మాజీ సర్పంచ్ బసయ్య తల్లి బండపల్లి నాగమ్మ మృతి చెందడంతో సుగవాసి ప్రసాద్‌బాబు గ్రామానికి వెళ్లి ఆమె మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

15న అయ్యప్ప పడిపూజ

రాజంపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని అయ్యప్పస్వామి ఆలయంలో నేటి నుంచి మండల పూజలు ప్రారంభమయ్యాయి. ఈనెల 15న కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని శబరిమల ఆలయంలో మండల పూజ ప్రారంభోత్సవం సందర్భంగా రాజంపేట ఆలయంలో పడి మహోత్సవం పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి తెలిపింది. ఈనెల 27న వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వామి సత్య నారాయణ ఛైర్మన్ పాల ప్రకాష్ ప్రకటించారు. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కృష్ణయ్యనాయుడు, సభ్యులు చంద్రమౌళి, గురుస్వామి దాము ఆచారి, సుధాకర్, గురుస్వామి నాగరాజు, ఆదినారాయణ, రమేష్‌బాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆకాశ దీపం

రైల్వేకోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక భుజంగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆకాశ దీపం వెలిగించారు. భక్తులు తెచ్చిన పూజ సామగ్రిని అక్కడ పెట్టి ఆలయ అర్చకులు యోగి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

పెనగలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చక్రంపేట ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, మ్యూజికల్ ఛైర్, పాటలు, డ్యాన్సు పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

కేన్సర్‌తో టీడీపీ కార్యకర్త మృతి

సిద్దవటం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కృషి చేసిన మండల పరిధిలోని కమ్మపాలేనికి చెందిన ఎం.సుబ్బరాయుడు(72) కేన్సర్ కారణంగా మంగళవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఆయనకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్డు అన్నీ ఉన్నాయని, పార్టీ కేంద్ర కార్యాలయం పరిశీలించి న్యాయం చేయాలని వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు.

యువతి ఆత్మహత్య కేసులో ఒకరి అరెస్ట్

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊటుకూరు గ్రామంలో రెండు రోజుల క్రితం ఉరి వేసుకుని బోనం నవీన అనే యువతి ఆత్మహత్య చేసుకున్న కేసులో బాదుల్లా అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మన్నూరు సీఐ మహ్మద్‌అలీ తెలిపారు. మృతురాలి ఆత్మహత్య విషయంలో బాదుల్లా ప్రమేయం ఉందని, ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతోపాటు ఇతరులను పెళ్లి చేసుకోవడం కూడా ఒక ప్రధాన కారణమన్నారు. దీనిపై పూర్వాపరాలు పరిశీలించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

ఆ 11మంది ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయండి

- సబ్‌కలెక్టరేట్ ఎదుట జనసేన డిమాండ్



సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

మదనపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీకి రాని ఆ 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ అసెంబ్లీకి రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజలను అవమానించినట్లేనని, ప్రజాసమస్యలపై చర్చించడానికి అసెంబ్లీకి రాకపోవడంపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఆ వైసీపీ ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ మేరకు వీరిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కోరారు. ఎక్కడా లేని విధంగా రాజంపేట పార్లమెంటులో పుంగనూరు, తంబళ్లపల్లె, రాజంపేట నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, అమర్నాథ్‌లు గెలిచినా..ప్రజల పక్షాన నిలవాల్సిన వీరంతా అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజలను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు అమర్ నారాయణ, తంబళ్లపల్లె జనసేన నాయకులు మల్లికార్జున, నరసింహులు, మదనపల్లె నియోజకవర్గ నాయకుడు సందీప్‌రెడ్డి, జగదీష్, చిరంజీవి, శంకర్, అప్సర్, మనోజ్, దేవేంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మార్పుతోనే వివక్షను పారదోలవచ్చు

- సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్

మదనపల్లెటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగి సమాజంలో మార్పు వచ్చినప్పుడే కుల వివక్షతను పారదోలవచ్చని తిరుపతి సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తిరుపతి సీఐడీ పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. సీఐడీ డీఎస్పీ మాట్లాడుతూ చదువుతో స్నేహాన్ని పెంచుకుంటే కుల, మతాలనే అంతరాలుండవన్నారు. పట్టణాలు, నగరాల్లో ఈ అంతరాలు చాలా తగ్గాయని, కేవలం గ్రామాల్లోనే అంటరానితనం అక్కడక్కడ చోటుచేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో 1997లో పుల్లయ్య కమిషన్ ఏర్పాటు చేశాక ఎస్సీ, ఎస్టీల మీద జరిగిన అరాచకాల పట్ల నివేదికలు అందించారని, ఆయన ప్రతిపాదించిన 18 అంశాలను హోంశాఖ ఆమోదించిదన్నారు. విద్యార్థి దశ నుంచే అందరూ సమానమన్న జాతీయభావన తీసుకురావాలన్నారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ కొందరికి ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన లేకపోవడంతో నేరాల్లో కూరుకుపోతున్నారన్నారు. బాధితులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై ఫిర్యాదు ఎలా చేయాలి, చట్ట ప్రకారం బాధితులకు అందే న్యాయం, సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం ఈ చట్టంపై అవగాహన పెంచుకున్న విద్యార్థులకు పలు అంశాలపై పరీక్ష నిర్వహించి ఉత్తమంగా రాసిన ఆరుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, సీఐడీ సీఐ కుళ్లాయప్ప, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ ప్రభాకరరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి జయప్రకాష్, తహసీల్దార్ ఖాజాబి, డీటీ కుమారి, ఏపీపీ వీరాంజనేయులు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.



బీటీ డిగ్రీ కళాశాలలో జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

మద్యం ముట్టరు.. మాంసం తినరు



పెద్దగొడుగు స్వామి ఆలయం

- గ్రామంలో పాదరక్షలు వేసుకోరు
- పల్లె ప్రజలందరిదీ ఒకేమాట.. ఒకే బాట
- ఆచారాలన్నీ తూచా తప్పకుండా పాటిస్తున్న పెద్దగొడుగు స్వామి భక్తులు



ఎగువమూలపల్లె గ్రామం వ్యూ

గాలివీడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అది ఒక కుగ్రామం. ఆచారాలకు, సంప్రదాయాలకు, కట్టుబాట్లకు నిలయం. ఆ గ్రామంలో 20 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వీరంతా మద్యం ముట్టరు, మాంసం తినరు. మంచం మీద కూర్చోరు. నల్లజీవాలను పోషించరు. ఆ పల్లె ప్రజలందరిదీ ఒకేమాట.. ఒకేబాట. ప్రాచీన సాంప్రదాయాలను, ఆచారాలను తూచా తప్పకుండా పాటిస్తూ జీవనం సాగిస్తున్నారు.

గాలివీడు మండల కేంద్రానికి 6 కి.మీ. దూరంలో ఉన్న తూముకుంట పంచాయతీ ఎగువమూలపల్లెలో ప్రాచీన కాలంలో కొన్ని యుగాల క్రితం నుంచి నోముల బ్రహ్మదేవుడిని పూజించడం ఆచారం. కానీ ఆ దేవుడి పూజారులకు (భత్తలయ్య) ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ఎక్కువ.

కట్టుబాట్లు కట్టుదిట్టం

నోములు బ్రహ్మదేవుడు (పెద్దగొడుగు) స్వామి భక్తులకు పల్లె ప్రజలకు ఆనాటి నుంచి నేటి వరకు కట్టుబాట్లు కట్టుదిట్టంగా పాటిస్తున్నారు. ఆ పల్లె ప్రజలు ఎవరూ చెప్పులు వేసుకుని గ్రామంలోకి వెళ్లరు. పల్లె శివారులో వదిలి వెళతారు. పూజారులు అయితే ఎప్పటికీ చెప్పులు వేసుకోరు. నులకమంచం మీద కూర్చోరు. కోళ్లను, నల్లజీవాలను పోషించరు. ఈత చాపల మీద కూడా నిద్రపోరు. మహిళలు బహిష్టు అయితే 5 రోజుల వరకు ఊరుబయట ఉండాల్సిందే. ఆడపిల్లలు మొదటిసారి అయినప్పుడు 12 రోజులు ఊరుబయట ఉండాల్సిందే. పల్లెలో ఎవరైనా చనిపోయినా కర్మకాండ పూర్తయ్యే వరకు వారి కుటుంబ సభ్యులు ఊరుబయట ఉంటారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే పెద్దగొడుగు స్వామి ఆలయ తలుపులను కూడా 12 రోజుల తర్వాత పురోహితులచే పూజలు చేసిన తర్వాతే తెరుస్తారు. ఇలా కట్టుదిట్టమైన సంప్రదాయాలకు కారణం భయం, భక్తిభావం.



ఊరిబయట వదిలిన చెప్పులు

ప్రాచీన కాలంలో భత్తులయ్య, భక్తలమ్మ అనే ఇరువురు స్వామి భక్తులు ఉండేవారు. భత్తులయ్య సమీపంలోని కొండలోకి తపస్సు కోసం వెళ్లగా ఆయన 7 మంది కుమారులు వివిధ రకాల వ్యాపారాలు కోళ్ల, మంచాలు, నల్లజీవాలు, ఈతాకుల వ్యాపారానికి వెళ్లారని, వీరికి కొన్ని గోవులు కూడా ఉండేవని గ్రామస్తులు తెలిపారు. భక్తలమ్మ పరమ పవిత్రత గల మహిళ అని, ఆమె బహిష్టు సమయంలో ఊరుబయట ఉండాల్సి వచ్చిందని, అలాంటి సమయాల్లో గోవులు (పశువులను) విప్పడానికి, భర్త భత్తులయ్యకు భోజనం వడ్డించడానికి ఎవ్వరూ లేకపోవడంతో గోవులు, భర్త ఆకలితో అలమటిస్తున్నప్పుడు ఆమె ఊరి కట్టుబాట్లను వదిలి గ్రామంలోకి వచ్చిందని తెలిపారు. అనంతరం గ్రామానికి అరిష్టం జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకపక్క భయంతో మరోపక్క భక్తితో గ్రామస్తులు ఉన్నట్లు ప్రజలు తెలిపారు.

కట్టుబాట్లకు కట్టుబడి ఉన్నాం

- పూజారి పెద్దమల్లయ్య



గ్రామస్తులందరూ కట్టుబాట్లకు కట్టుబడి ఉన్నారు. ఎవరూ ఈత చాప, మంచం మీద కూర్చోము, మాసం, మద్యాన్ని సేవించడం, చెప్పులు వేసుకొని తిరగం. మేము భక్తి శ్రద్ధలతో నోములు బ్రహ్మదేవుడు (పెద్దగొడుగు) స్వామిని కొలుస్తాము. ఇప్పటి వరకు కట్టుబాట్లను ఉల్లంఘించలేదు. అలా ఎవరైనా ఉల్లంఘిస్తే అప్పుడే వారి కుటుంబంలో ఏదో ఒకటి జరుగుతూ వస్తున్నది.

ఆచార వ్యవహారాలను పాటిస్తున్నాం

- వీరమ్మ, ఎగువమూలపల్లె, తూముకుంట



పల్లెల్లోని మహిళలందరం ఆనాటి నుంచి ఇప్పటి వరకు ఆచారాలు, సంప్రదాయాలను పాటిస్తున్నాం. అంటు, ముట్టు అయితే అయిదు రోజులు ఊరు బయట ఉంటాము. పెద్దగొడుగు స్వామికి 110 ఎకరాల సిగురువనము కలదు. ఆ వనంలోకి ఎవ్వరము (బహిష్టు) అంటూ అయిన వారము వెళ్లలేదు. చిగురువనంలోని చెట్లను ఎవరూ నరకం. ఆ కట్టెలను ఎవరు తీసుకురారు. ఆ వనాన్ని పవిత్రంగా భావిస్తాము.



పెద్దగొడుగుస్వామికి చెందిన చిగురువనము

రైల్వేకోడూరులో వర్షం

- వీధులు జలమయం
- నేలకూలిన వృక్షం
- రాకపోకలకు అంతరాయం

రైల్వేకోడూరు, నవంబరు 13: (ఆంధ్రజ్యోతి) మండలంలో బుధవారం ఒక మోస్తారు వర్షం కురిసింది. దీంతో రంగనాయకులపేట, కొత్తబజారు, రైల్వేస్టేషన్ రూటు, ధర్మాపురం, సూర్యానగర్, నరసరాంపేట తదితర వీధి రోడ్లు జలమయమయ్యాయి. పాదచారులు పలు ఇక్కట్లు పడ్డారు. మండలంలోని అనంతరాజుపేట ప్రధానదారికి పక్కనే ఉన్న పెద్దవృక్షం వర్షం దెబ్బకు నేలకూలింది. కూలిన వృక్షం ప్రధానదారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరాజుపేట సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జున, గ్రామస్తులు కలసి అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని యంత్రాలతో కోయించి కొమ్మలను తొలగించారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.





సూర్యానగర్‌లోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు, (ఇన్‌సెట్లో) రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు

వృత్తే ఇంటిపేరుగా మారింది

- మైలాపురం నరసింహులు అలియాస్ పేపర్ నరసింహులు
- 50 ఏళ్లుగా నడుస్తూనే పేపర్ పంపిణీ

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేస్తున్న వృత్తే ఇంటి పేరుగా మారేంతగా ఆయన పనిలో జీవిస్తున్నారు. ఏదొక పని చేస్తూ జీవనం సాగించేది సాధారణమైనా పనే దైవంగా భావిస్తూ చేస్తున్న వృత్తికి న్యాయం చేయడం చూస్తే ఆయన ఆపనిని ఎంతలా ప్రేమిస్తున్నారో తెలుస్తోంది. పుట్టుకతో తల్లిదండ్రులు పెట్టిన పేరును సైతం మార్చి చేస్తున్న వృత్తి పేరునే ఇంటి పేరుగా పిలిపించుకుంటున్నారు. మైలాపురం నరసింహులు అంటూ పిలిస్తే పలుకరేమోకానీ పేపర్ నరసింహులు అంటూ పిలిస్తే నిద్రలో కూడా పలుకుతారు. సుమారు 50 ఏళ్లగా నడుచుకుంటూనే పేపర్ వేస్తూ తిరిగే ఈయన జీవిత చక్రంలోకి తొంగిచూస్తే...

స్థానిక అలమ్మవారిశాల వీధికి చెందిన 76 ఏళ్ల మైలాపురం నరసింహులు వైశ్యకుటుంబంలో 1948లో పుట్టారు. 1964లో ఓ దుకాణంలో గుమాస్తాగా పనికి చేరారు. 1969లో ఎం లక్ష్మికుమారిని వివాహం చేసుకున్నారు. కుటుంబంలో మనిషి పేరిగే కొద్దీ ఖర్చులు పెరుగుతాయని భావించిన ఆయన దుకాణంలో పనిచేస్తూనే అదనపు ఆదాయం కోసం 1974 నుంచి హిందూ పేపర్‌ను ఇంటింటికీ వెళ్లి పంచడం మొదలెట్టారు. అప్పట్లో సైకిల్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఆ సైకిల్ కూడా నేర్చుకోలేదు, నడుచుకుంటూనే ఇంటింటికీ వెళ్లి పేపర్ వేసేవారు. ఆ తర్వాత ఉదయం పేపర్ కూడా కలిపి పంపిణీ చేసేవారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు హిందూ పేపర్ పంపిణీ చేస్తున్నారు. అప్పట్లో ఊరు చిన్న విస్తీర్ణంలోనే ఉండేది. చుట్టూ నాలుగైదు కిలోమీటర్ల వరకు తిరిగేవారు. ఇపుడు ఊరు బాగా పెరిగింది. సుమారు ఏడెమినిది కిలోమీటర్లు తిరిగి ఇళ్లవద్దకు వెళ్లి పేపర్ వేయాల్సి వస్తోంది.



మైలాపురం నరసింహులు అలియాస్ పేపర్ నరసింహులు

పట్టణమంతా 13 పేపర్లు వేయాల్సి ఉంటుంది. అయితే ఇంటింటికీ వెళ్లి వేయాల్సి ఉన్నందున ఊరంతా నడుస్తూ వెళ్లాల్సిందే. పేపర్ వేయడం ద్వారా వచ్చే రోజు ఆదాయం రూ.26. కానీ ఇద్దరు పిల్లలకు పెళ్లి చేసి 76ఏళ్లు వచ్చినా ఆదాయం కోసం కాకుండా ఒకహాబీగా పేపర్ పంపిణీ చేయడం అలవాటుగా మారింది. ఏదొక పనితో జీవనం సాగించడం ప్రతి ఒక్కరూ చేస్తున్నా అసలు పేరును సైతం మరచిపోయేలా వారి జీవితం సాగింది. అంతగా ఆ పనిలో వారు తలమునకలై పోయారు. ఆ వృత్తి కుటుంబ పోషణకు ఉపయోగపడుతూ పనిని ఆస్వాదిస్తూ చేయడం ఆయన దైనందిన జీవితంలో ఒక్కటై పోయింది. ఓపిక ఉన్నంత వరకు ఇలా నడుస్తూనే పేపర్ వేయడం దైనందిన జీవితంలో అలవాటుగా మారిపోయిందని పేపర్ నరసంహులు చెబు తున్నాడు. ఇప్పుడిప్పుడే ఓపిక తగ్గుతోంది. ఓపిక ఉన్నంత వరకు చేస్తాను అని ఆనందంగా చెప్పారాయన.





ఇళ్లకు, షాపులకు పేపర్ పంపిణీ చేస్తున్న నరసింహులు

సామరస్యంగా ఎన్నికలు జరిగేలా చర్యలు

- జిల్లాలో 167 చెరువులకు సాగునీటి ఎన్నికలు
- ఎన్నికల శిక్షణ సమావేశంలో అధికారుల స్పష్టీకరణ

మదనపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి ఎన్నికలు సామరస్య వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఆర్డీవో రాఘవేంద్ర సూచించారు. స్థానిక మున్సిపల్ టౌన్ హాలులో బుధవారం మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమించిన ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం 3276 చెరువులు ఉన్నాయన్నారు. ఇందులో వంద ఎకరాలు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణం (సాగు) గల 167 చెరువులకు సాగునీటి తీరువా ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు. తప్పనిసరైతే తప్ప ఎన్నికలకు వెళ్లకూడదని, సెలక్షన్ స్థాయిలోనే సరిపెట్టేలా చూడాలని సూచించారు. సాగునీటి సంఘాలకు ఈనెల 20న నోటిఫికేషన్ విడుదల చేసి, 23వ తేదీ ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారం, పది రోజులు రీషెడ్యూల్ చేసే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్ ఈఈ, మాస్టర్ ట్రైనర్ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో సర్పంచి, వార్డు సభ్యునికి పోటీ చేయడానికి ఉండే అర్హతతో పాటు సాగునీటి సంఘం ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థికి అదనంగా కనీసం 1432 పసలీ వరకు సాగునీటి తీరువా చెల్లించి ఉండాలని స్పష్టం చేశారు. రాయచోటి ఆర్డీవో, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్నికల అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 167 చెరువుల కింద గల సాగునీటి ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితా సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలశాఖ, అంగన్‌వాడీ, తదితర విభాగాలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు. ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపై మదనపల్లె ఆర్డీవోతో పాటు ఇద్దరు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌లో తండ్రీ కొడుకులకు ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా విధించిన న్యాయమూర్తి

రేణిగుంట/మంగళం/రైల్వేకోడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన తండ్రీ కొడుకులకు ఎర్రచందనం కేసులప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధించారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్సు అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి బీటు కృష్ణాపురం సెక్షన్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం సిరివరం గ్రామానికి చెందిన తండ్రి తోట చిన్న చెంగయ్య, కుమారుడు చెంగయ్య పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరిద్దరిపై 2019, 2022 సంవత్సరాల్లో కేసులను నమోదు చేశామన్నారు. ఇంత కాలంగా కొనసాగుతున్న విచారణలో వీరిని దోషులుగా గుర్తించి ఆర్ఎస్ఎస్ ఏడీజే న్యాయస్థాన న్యాయమూర్తి నరసింహమూర్తి తండ్రీ కొడుకులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారన్నారు. శిక్ష పడిన వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. ఈ తీర్పు ఎర్రచందనం స్మగ్లర్లకు ఒక హెచ్చరికగా పనిచేస్తుందన్నారు.



తోట చిన్న గంగయ్య, చెంగయ్య

11 మంది ఐసీడీఎస్ ఉద్యోగులపై విచారణ

- పులివెందుల పూర్వ సీడీపీవో సావిత్రితో సహా
- 10 మంది సూపర్‌వైజర్లపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాజెక్టుకు గతంలో సీడీపీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన జి.సావిత్రితో సహా మరో 10 మంది సూపర్‌వైజర్లపై కూడా ఈ విచారణ కొనసాగనుంది. ఇందులో ఒక సూపర్‌వైజర్ మరణించడంతో ఆమెను మినహాయించాలని కూడా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రూ.8,71,862లు విలువైన బియ్యం, పప్పులు, ఆయిల్ వంటి ఎస్ఎన్‌పీ ఆహార పదార్థాలు దుర్వినియోగం జరిగినట్లు 2017లో గుర్తించారు. ఈ విషయాన్ని శాఖాపరమైన విచారణలో నిర్ధారణ కావడంతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనరు 2017 జూలై 24న ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి సంజాయిషీ నోటీసులిచ్చి విచారణ కొనసాగిస్తూ వచ్చారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ విచారణ ఐదేళ్లపాటు మరుగున పడింది. తాజాగా పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సమగ్రంగా విచారణ జరపడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా పనిచేసి రిటైర్డ్ అయిన జి.సావిత్రి, అదే విధంగా రిటైర్డ్ అయిన సూపర్‌వైజర్లు జె.ఎమిలియా, బి.రామానుజమ్మ, ఎం.రత్నకుమారితో పాటు ప్రస్తుతం ఉద్యోగాల్లో కొనసాగుతున్న సూపర్‌వైజర్లు కె.భారతి, వై.వి.రమణమ్మ, జి.లక్ష్మీదేవి, జె.వరలక్ష్మి, సరస్వతమ్మలపై పూర్తి విచారణకు ఆదేశించారు. వీరు కాకుండా మరణించిన మరో ఇద్దరు సూపర్‌వైజర్లు వెంకటసుబ్బమ్మ, సి.చెన్నమ్మలను విచారణ నుంచి మినహాయించాలని కూడా పేర్కొన్నారు. ఇందుకు కడప ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసరును విచారణాధికారిగా నియమించారు. విచారణాధికారికి అవసరమైన రికార్డులను సేకరించి అందుబాటులో వుంచేందుకు ప్రెజెంటింగ్ అధికారిగా పులివెందుల ప్రస్తుత సీడీపీవోను కూడా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మహిళ, శిశు, ప్రత్యేక ప్రతిభావంతులు, వయోజనుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మ కాపు..ఉఫ్

- అన్ సీజన్‌లో రుమాని మామిడి కాపు
- దెబ్బతీసిన మంగు.. డీలా పడ్డ రైతులు
- దిగుబడులు వచ్చినా కానరాని ధరలు
- టన్ను రూ.10వేలు పలుకుతున్న వైనం
- లోకల్ మార్కెట్‌లో విక్రయాలు

రైల్వేకోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్ సీజన్‌లో రుమాని రకం మామిడి కాపునిచ్చింది. రైతన్నలు మంచి ధరలు పలుకుతాయని సంతోషపడ్డారు. అయితే వారి ఆశలను ఆవిరిచేస్తూ వర్షం రూపంలో దెబ్బతీసింది. తరచూ వర్షం కురవటంతో కాయలకు మంగు ఏర్పడింది. దీంతో మామిడి కాయలను జాతీయ మార్కెట్‌లో అమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో రైతులు డీలా పడ్డారు. లోకల్ మార్కెట్‌లో అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లం పేట, పెనగలూరు, ఓబుల వారిపల్లె మండలాల్లో ఎండవేడిమికి ఈ సారి రుమాని ఉమ్మకాపు బాగా వచ్చింది. కాయలు కొన్నిచోట్ల మాత్రమే మంగు లేకుండా దిగుబడులు వచ్చాయి. దీంతో కొందరు ముందస్తుగానే పచ్చళ్లకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశారు. డిల్లీ, ముంబాయ్ నగరాల్లో ఉన్న మార్కెట్‌లోకి కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మంగులేని మామిడి కాయలు రావడంతో రైల్వేకోడూరు కాయలకు డిమాండు తగ్గిపోయింది. దీంతో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, తిరుపతి, కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల మార్కెట్‌కు రైతులు తరలిస్తున్నారు. టన్ను రూ.10వేలు చెప్పున విక్రయాలు సాగుతున్నాయి.



రైల్వేకోడూరులో కాసిన రుమాని మామిడి కాయలు



శెట్టిగుంట వద్ద పూత దశలో ఉన్న మామిడి చెట్టు

రైల్వేకోడూరు నుంచి ఇతర రాష్ట్రాలకు 4 నుంచి 5 లోడ్ల వరకు కాయలు ఎగమతి చేశారు. మంగు రాకపోయి ఉంటే చాలా మంది రైతులు మంచి లాభాలు గడించేవారు. గత నెల నుంచి రుమాని మామిడి కాయలు కోతలు ప్రారంభమయ్యాయి. తమిళనాడులోని క్రిష్ణగిరి, దిండిగల్, కేరళలోని పాల్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో రైతులు కల్తార్ మందులు ఉపయోగించడంతో రుమాని, తోతాపూరి కాపునిచ్చింది. ప్రస్తుతం అన్ని రకాల మామిడి చెట్లకు ముందస్తుగానే పూతలు వస్తున్నా వర్షం దెబ్బకు మగ్గిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంగు దెబ్బతీసింది



రుమాని మామిడి కాయలకు మంగు దెబ్బతీసింది. మార్కెట్‌లో ఎప్పటికి మామిడికి డిమాండ్ ఉంటుంది. అన్ సీజన్‌లో ఎక్కువగా నీలం, పునాసా, అల్లీపసందు మామిడి కాయలు మాత్రమే వస్తున్నాయి. అయితే ఈ ఏడాది రుమాణి రకం అన్ సీజన్‌లో కాపు కాయడంతో సంతోషపడ్డాం. అయితే మంగు రావడంతో ఫలితం లేకుండా పోయింది.

-కస్తూరి రామచంద్రనాయుడు, రైతు, రైల్వేకోడూరు

వ్యాపారం బాగుంటుందని అనుకున్నాం



రుమాని మామిడి కాయలు కాపునిచ్చాయని.. వ్యాపారం బాగా ఉంటుందని అనుకున్నాం. అయితే కాయలకు మంగు రావడంతో వ్యాపారం లేకుండా పోయింది. కొందరి రైతుల తోటల్లోనే కాయలకు మంగు లేదు. వాటిని కొద్దిగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేశాం.

-తిమ్మిశెట్టిపల్లి మణి, మామిడి వ్యాపారి

సాధారణంగా మామిడి డిసెంబరు మాసంలో పూతలు వచ్చి మార్చి నెలాఖరకు కాయలు మార్కెట్‌లోకి వస్తాయి. జూన్ ఆఖరి కల్లా మామిడి సీజన్ పూర్తి అవుతుంది. సీజన్ తర్వాత నీలం రకం మామిడి మాత్రమే ఉమ్మ కాపు వస్తుంది. సెప్టెంబరు నెలాఖరు వరకు ఉమ్మకాపు కాయలు మార్కెట్‌లో లభిస్తాయి. తర్వాత అల్లీపసందు మామిడి కూడా ఉమ్మకాపునిస్తుంది. ఇది ఎక్కువగా వినియోగ దారు లు ఊరగాయకు ఉపయోగిస్తారు. నీలం తర్వాత పునాసా మామిడి ఏడాదికి రెండు సార్లు కాపు నిస్తున్నాయి. అయితే ప్రస్తుతం ఈ నెలలో తొలిసారిగా రైల్వేకోడూరు ప్రాంతంలో రుమాణి ఉమ్మకాపు నిచ్చింది. గతంలో ఒక్కసారి తోతాపూరి కాయలు మాత్రమే ఉమ్మ కాపు నిచ్చాయి. వాతావరణ పరిస్థితుల్లో ఎక్కువగా మార్పులు రావడంతోనే ఇలా జరుగుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



గండిలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల పూజా కార్యక్రమాలు

చక్రాయపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధి గాంచిన గండి క్షేత్రంలో పవితోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రెండో రోజు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బ య్య పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు ఉదయం వేద దివ్య ప్రబంధ పారాయణాలతో ప్రారంభించారు. ద్వార తోరణ పూజ, సోమకుంభ ప్రతిష్ఠ, మహా కుంభారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, మూలమత్ర వాహనం, స్నపన తిరుమనం, పవిత్రో ప్రతిష్ఠ, ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. సాయంత్రం చతుఃస్థానార్చన, వేద ప్రబంధ పారాయణాలు, త్రికాల ఆరాధన, సుందరకాండ పారాయణం, హోమం లఘుపూర్ణాహుతి, నివేదన, శాత్తుముఱై, గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కడప(వినాయకనగర్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రసన్నకుమారి, పల్లవి జాతీయస్థాయి అండర్-18 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ అరుణకుమారి తెలిపారు. డిసెంబరు 11 నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి గోవిందరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వైఖరిపై నిరసన



రాజంపేట డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్యూటీ చార్టు వేయడంలో రాజంపేట డిపో అసిస్టెంట్ మేనేజర్ మాధవీలత అవకతవకలకు పాల్పడుతూ వేధిస్తున్నారంటూ జిల్లా ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి బీసీ శేఖర్ ఆధ్వర్యంలో రాజంపేట ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం డ్రైవర్లు, కండక్టర్లు ఆందోళన చేశారు. అన్ని అసోసియేషన్ల ఉద్యోగులను సమానంగా చూడాల్సిన అసిస్టెంట్ మేనేజర్ వైసీపీ అనుబంధాల సంఘాల కు అనుకూలంగా పని చేస్తున్నారన్నారు. సెలవుల మంజూరులో పక్షపాతం చూపుతున్నారన్నారు. వైసీపీకి అనుకూలంగా పనిచేస్తూ కార్మికులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు చలపతి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, డిపో కార్యదర్శి మౌలా పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు సస్పెన్షన్



సుండుపల్లె జడ్పీ హైస్కూల్‌లో డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

సుండుపల్లె/రాయచోటి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన తెలుగు ఉపాధ్యాయుడు లోకేశ్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం బుధవారం రాత్రి ప్రకటించారు. 8వ తరగతి విద్యార్థి విఘ్నేష్‌ను ఉపాధ్యాయుడు కొట్టినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఆయన వివరించారు. అంతకుముందు రాయచోటి డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన సంఘటపై విచారణ నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యా యులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడిని మందలించారు. మండల విద్యాశాఖ అధికారులు వెంక టేశ్ నాయక్, రవీంద్రనాయక్, హెడ్మాస్టర్ పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లుంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు అని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు, రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు నిత్యం విమర్శించేవన్నారు. ప్రస్తుతం చంద్రబాబు, మోదీ ప్రభుత్వాలు అంతకుమించి అప్పులు చేస్తున్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 7 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం రూ.59వేల కోట్లు అప్పు చేసిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్స రంలో రూ.91,443 కోట్ల అప్పు చేస్తామని బడ్జెట్‌లోనే చూపించారన్నారు. 1947 నుంచి 2014 వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం 47లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందన్నారు. 2014 నుంచి 2024 వరకు మోడీ ప్రభుత్వం అదనంగా రూ.122 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీకి 15 మంది విప్‌లను ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతమంది విప్‌లు లేరని తులసిరెడ్డి అన్నారు.

చెరువు కట్టను పరిశీలించిన డ్వామా పీడీ



కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు వద్ద ఫిర్యాదు దారుడితో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పెద్ద తిప్ప సముద్రం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్టను బుధవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీ మధుబాబు, ఉపాధి హామీ ఏపీవో తిరుపాలప్పతో కలిసి పరిశీలించారు. ఇటీవల కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్టపై గుట్టలో వెలసిన నరసింహస్వామి ఆలయం వద్దకు రోడ్డు వేయాలని కందుకూరుకు చెందిన రవిస్వామి అనే వ్యక్తి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలతో పాటు కలెక్టర్‌కు లేఖ రాయడంతో స్పందించిన అధికారులు బుధవారం కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు కట్ట వద్దకు చేరుకుని ఫిర్యాదుదారుడితో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసి పనులను ప్రారంభించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఉపాధి సిబ్బందిని పీడీ ఆదేశించారు. చెరువులో నీరు అయిపోగానే ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడికతీత పనులను చేపట్టవచ్చని తెలిపారు ఆయన వెంట ఏపీడీ మధుబాబు, ఏపీవో తిరుపాలప్ప, ఉపాధి హామీ జేఈ మహేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, కదిరప్ప ఉన్నారు.

రూ.473 కోట్లతో హంద్రీ-నీవా కాలువ మరమ్మతు పనులు ప్రారంభం



బి.కొత్తకోట శివారులో హంద్రీ-నీవా కాలువ పనులు చేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు రూ.473 కోట్లతో పనులు చేపట్టారు. బి.కొత్తకోట-పీటీఎం మండలాల సరిహద్దులో రెండు రోజులుగా పనులు ప్రారంభమయ్యాయి. ఎక్స్‌కవేటర్లతో జంగిల్ క్లియరెన్స్, కాలువ గోడలకు మరమ్మతు పనులు చేస్తున్నారు. కాలువ విస్తరణ పనులు ప్రస్తుతానికి వాయిదా పడటంతో ఉన్న కాలువలోనే నీటిని కుప్పం వైపునకు తరలించేవిధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పీటీఎం నుంచి 132 కి.మీ మేర పనులు పూర్తి చేయనున్నారు. సత్యసాయి జిల్లా చెర్లోపల్లె రిజర్వాయరు నుంచి పీటీఎం, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు మీదుగా కుప్పంకు వచ్చే ఏడాది మే నెలకు నీటిని తరలించే లక్ష్యంతో పనులు చేపట్టినట్లు హంద్రీనీవా ఎస్ఈ రాజగోపాల్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలి

- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప మారుతీనగర్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా పాలక ప్రభు త్వాలు త్వరితగతిన ఆర్డినెన్స్ జారీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాటాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలకు రాజ్యాంగపరమైన ఎస్సీ రిజర్వే షన్‌లో సరైనరీతిగా న్యాయం జరగలేదన్నారు. ఈనెల 11 నుంచి జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశా లలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలపాలని కోరు తూ గతంలో రామచంద్ర కమిషన్ ఎస్సీ జాబితాలోని 59 ఉపకులాలను ఏబీసీడీగా వర్గీకరించి కులాల వారీగా రిజర్వేషన్‌ల పంపిణీ జరిగిందన్నారు. ప్రస్తుతం పాలక ప్రభుత్వాలు రిజర్వే షన్‌లను మూడు కేటగిరీలుగా ఏబీసీ చేయాలని జిల్లా యూనిట్‌గా తీసుకు న్నందుకు దళిత ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి తెలియపరచారన్నారు. ఏది ఏమైనా షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు అడ్డంకులు లేకుండా రాజ్యాంగంలోని 9వ షెడ్యూ ల్డ్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం ద్వారా శాశ్వత పరిష్కారం సులువు అవుతుందన్నారు. ఆదిశగా పాలక ప్రభుత్వాలు త్వరితగతిన ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా చూడాలన్నారు. కాగా, నిరసన కార్యక్రమానికి ముందు దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి.. అక్క డ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకు న్నారు. డప్పు చర్మకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, సమితి రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు బాలలక్ష్మ య్య, కర్ణ, రమాదేవి, అంజనమ్మ, సుబ్బ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయండి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప ఎన్టీఆర్ సర్కిల్ నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ చాంబర్‌లో 71వ అఖిలభారత సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 14న సహకార మంత్రిత్వశాఖ కొత్త కార్యక్రమాల ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేసే కార్యకమాలు, 15న సహకార సంఘాలతో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన కార్యక్రమాలు, 16న వ్యవ స్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర కార్యక్రమాలు, 17న సహకార సంస్థలు వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించు కార్యక్రమాలు, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కొరకు సహకార సంఘాలు కార్యక్రమాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో సహకర సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీవో జి.సుభాషిణి, డీసీఈ బ్యాంకు సీఈవోపీ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



ప్రొద్దుటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ తాత్కాలిక కురగాయల మార్కెట్ వద్ద పెద్దమ్మగుడి పేరుతో మున్సిపల్ స్థలం ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంపై హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు కమిషనర్ మల్లికార్జున, ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్‌లు భారీ పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ స్థలంలో కట్టిన తాత్కాలిక షెడ్లు, బంకులు ఎక్స్‌వేటర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ స్థలం ఆక్రమించి కట్టిన పెద్దమ్మఆలయంతో పాటు ఇతర తాత్కాలిక కట్టడాలు, షెడ్లు , బంకులు తొలగించాలని గత కమిషనర్, ఏసీపీ నోటీసులు ఇచ్చారన్నారు. ఆ నోటీసులపై ఆక్రమణ చేసిన సుధాకర్ అనే వ్యక్తి హైకోర్టుకు వెళ్లాడన్నారు. హైకోర్టు కొంత సమయం ఇచ్చి విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అందులో బాగంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆ స్థలం పూర్తి రికార్డులు పరిశీలించి అది మున్సిపాలిటీదిగా ధ్రువీకరించారన్నారు. అలాగే సదరు వ్యక్తి పెద్దమ్మ ఆలయం పేరుతో ఆలయం చుట్టూ వున్న స్థలంలో తాత్కాలిక షెడ్లు నిర్మించారు. వాటిని అద్దెలకు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఆమేరకు హైకోర్టుకు నివేదిక ఇచ్చామన్నారు. ఆతరువాత సదరు ఆక్రమణ దారునికి నోటీసులు ఇచ్చినా స్పందించని కారణంగా పోలీసు బందోబస్తు సహకారంతో తొలగించామన్నారు.

వివాదాస్పద వసతి గృహ కాంపౌండ్ తొలగింపు



కాంపౌండ్‌ను తొలగించిన దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నడింపల్లెలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం కాంపౌండ్ తొలగింపు వివాదాస్పదంగా మారింది. వసతి గృహంలో రెండు హాస్టళ్లతోపాటు ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయం ఉంది. హాస్టల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నడింపల్లె మున్సిపల్ హైస్కూలు విద్యార్థుల కోసం నాడు-నేడు పనుల ద్వారా మూడు తరగతి గదులు నిర్మించారు. ఆ తరగతి గదులకు హాస్టల్‌లో నుంచి వెళ్లడానికి తగిన ఏర్పాటు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కోరారు. వసతి గృహాన్ని పరిశీలించి కాంపౌండ్ వాల్ తొలగించి గేటు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అయితే సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల అనుమతి లేకుండానే కాంపౌండ్ వాల్‌ను తొలగించారు. గేటు ఏర్పాటు చేయడానికైతే కాంపౌండ్‌వాల్‌ను పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఏముందని హాస్టల్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. కాంపౌండ్‌ను తొలగించడం వలన హాస్టల్ విద్యార్థులకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాలువ పూడిపోవడం వలన హాస్టల్‌లోని మురికినీరు అసలే నిలుస్తోందన్నారు. కాంపౌండ్ తొలగింపుపై హాస్టల్ అధికారులు ఏఎస్‌డబ్ల్యూవో, సాంఘిక సంక్షేమశాఖ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా కాంపౌండ్ తొలగింపుపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. కాంపౌండ్ తొలగింపుపై కలెక్టర్‌కు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళుతామని, తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు ఓబులేసు, బాస్కర్, చెన్నమ్మ, ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు.

ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా

- చినుకు పడితే రొచ్చు..రొచ్చుగా మదనపల్లె టమోటా మార్కెట్
- ఎక్కడ చూసినా కుళ్లిన టమోటాలు, బురదమయ ప్రాంతాలు
- మార్కెట్‌లో అధ్వాన్నంగా పారిశుధ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద మార్కెట్, ఆదాయంలో కూడా ఏమాత్రం తీసిపోని మదనపల్లె టమోటా మార్కెట్ వసతులలేమితో కొట్టుమిట్టాడుతోంది. మార్కెట్‌లో పారిశుధ్య నిర్వహణకు ఏటా రూ.8లక్షల నిధులు కేటాయిస్తున్నా, ఇక్కడ శుభ్రం చేసే వారు కరువయ్యారు. చిన్నపాటి వర్షం వస్తే చాలు మార్కెట్‌లో సిమెంటు రోడ్ల పైన కూడా బురద చేరుకుని కూలీలు, రైతులు, వ్యాపారులు నడిచేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.



టమోటా మార్కెట్‌లో నడవడానికి కూడా వీలులేకుండా పేరుకుపోయిన బురద

అన్‌సీజన్‌లో పారిశుధ్య పనులు కరువు

మదనపల్లె టమోటా మార్కెట్‌లో 80 దాకా లైసెన్స్ కలిగిన మండీలు ఉండగా అనధికారికంగా మరో 25 మండీలు ఉన్నాయి. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా రైతులు టమోటాలను విక్రయానికి తీసుకొస్తున్నారు. కాగా సీజన్‌లో నిత్యం 1000 టన్నులకు పైగా టమోటా విక్రయానికి వస్తుండగా, అన్‌సీజన్‌లో నిత్యం 200 టన్నుల టమోటా విక్రయానికి వస్తోంది. ఈ క్రమంలో పగిలిపోయిన టమోటాలు, కుళ్లిన టమోటాలను కూలీలు ఏరివేసి, పక్కనే పడేస్తున్నారు. సీజన్‌లో పర్వాలేదు కాని, అన్‌సీజన్‌లో పారిశుధ్యం పనులు నిర్వహించకపోవడంతో టమోటాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మండీల మధ్యన నిత్యం పడే చెత్త మూడు రోజులుగా కురుస్తున్న జడివానతో అధ్వాన్నంగా మారుతోంది.

చినుకు పడితే రొచ్చు...రొచ్చు

మదనపల్లె టమోటా మార్కెట్‌లో నాలుగు వైపులా వెడల్పైన సీసీ రోడ్లు నిర్మించారు. కాకుంటే రోడ్డుకు ఇరువైపులా మండీల యజమానులు మట్టితోలి, అక్కడ టమోటా క్రేట్లను పెట్టి లోడింగ్ చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే ఈ మట్టి అంతా కరిగిపోవడంతో పాటు, లారీలు తిరుగుతుండటంతో బురద అంతా రోడ్ల మీదికి చేరి రొచ్చు రొచ్చుగా మారింది. ఈ బురదలోనే మండీల్లో మిగిలిపోయిన టమోటాలను పారవేస్తుండటంతో రొచ్చులో కుళ్లిన టమోటాలు పడి పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఇకనైనా మార్కెట్ కమిటీ అధికారులు ప్రతి రోజు పారిశుధ్య పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీంతో పాటు ప్రతి నాలుగు రోజులకు ఒక సారి సీసీరోడ్లపై పేరుకుపోయిన బురదను క్లీన్ చేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్లను శుభ్రం చేయిస్తాం

టమోటా మార్కెట్‌లో సీసీరోడ్లపై ఉన్న బురదను పది రోజులకు ఒకసారి డోజర్‌తో శుభ్రం చేయిస్తాం. ప్రతిరోజు పారిశుధ్య పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తాం. దెబ్బతిన్న టమోటాలను ఒక చోట చేర్చి, పారిశుధ్యం తొలగించే ట్రాక్టర్ వచ్చినప్పుడు దానిలో వేయాల్సిందిగా మండీ యజమానులకు సూచనలిస్తాం. ఎమ్మెల్యే ఆదేశాలతో ఇప్పటికే రైతులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం.

-అభిలాష్, కార్యదర్శి,
మార్కెట్ కమిటీ, మదనపల్లె

ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం



వాల్మీకిపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి సీఎం నారాచంద్ర బాబునాయుడుకే సాధ్యమని వాల్మీకిపురం మండల మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ పథకాలు నిర్వీర్యం చేశారని విమర్శించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రత్యేకించి నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. సంఘం మండల అధ్యక్షుడు రెడ్డిరామ్, అధికార ప్రతినిధి వీరభద్ర, గుర్రంకొండ మండల అధ్యక్షుడు నరసింహులు, నాయకులు శ్రీనివాసులు, గురుమూర్తి, రాజన్న, కేశవ, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్‌కు ఘన సన్మానం



మైఫోర్స్ మహేష్‌ను సన్మానిస్తున్న తంబళ్లపల్లె జనసేన నాయకులు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన మైఫోర్స్ మహేష్‌ను బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గం జనసేన నాయకులు ఘనంగా సన్మానించారు. మదనపల్లెలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువను కప్పి సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అభివృద్ధిలో బాగా వెనుకబడ్డ తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఇండిస్ట్రియల్ హబ్‌గా తీసుకురావాలని కోరారు. పీటీఎంకు చెందిన ముద్దసాని నాగరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లెం శివయ్య, ఎస్ శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అమర్ నారాయణ, మస్తాన్‌లు ఉన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

పీలేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీలో జరగుతుండిన ఓ బాల్య వివాహాన్ని బుధవారం అధికారులు అడ్డుకున్నారు. మైనారిటీ తీరని తన కుమార్తెకు బలవంతంగా పెళ్లి చేస్తున్నారంటూ బాలిక తల్లి తన సోదరుడి ద్వారా పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ బాలకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత గ్రామాన్ని సందర్శించి పెళ్లి ఏర్పాట్లను నిలిపివేశారు. బాలికకు మైనారిటీ తీరనందున వివాహం చెల్లదని, వివాహ వయస్సు వచ్చే వరకు ఆగాలని కౌన్సెలింగ్ ఇచ్చి పంపివేశారు. దీంతో వివాహం నిలిచిపోయింది.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

మదనపల్లె టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని సీడీపీవో సుజాత పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాపూజి మున్సిపల్‌హైస్కూల్లో 100 రోజుల అవగాహన సమావేశాల్లో భాగంగా విద్యార్థినులతో పలు అంశాలను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ విద్యార్థినులు మానసికి ధైర్యంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతమ్మ, ఎంఎస్‌కే ముబీనా, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాదుల కల్పనకు వ్యక్తిగత రుణాలు

తంబళ్లపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల సభ్యులకు జీవనోపాదుల కల్పనకు వ్యక్తిగత రుణాలు పంపిణీ చేస్తున్నట్లు డీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయాన్ని డీపీఎం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీలు, సంఘమిత్రలతో ఎస్‌హెచ్‌జి ఇన్‌కం ప్రొఫైలింగ్ యాప్ సర్వేపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మహిళా వ్యక్తిగత రుణాల పంపిణీలో జిల్లా మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మహిళా వ్యక్తిగత రుణాలు 6,900 మందికి పంపిణీ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 2515 మందికి రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌జి ఇన్‌కం ప్రొఫైలింగ్ సర్వే ద్వారా ప్రతి కుటుంబం ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధి, ప్రస్తుత వారి పరిస్థితి, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపియం గంగాధర్, సీసీలు రమణ, నరసింహులు, ఆదిలక్ష్మీ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా నిర్వహించాలి



: కొండయ్యగారిపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సురేష్

నిమ్మనపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు నిర్వహించే పశుగణన పక్కాగా ఉండాలని పశువైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. బుధవారం కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారిపల్లిలో పశువులకు టీకాలు వేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఐదేళ్లకు ఒకసారి పశుగణను నిర్వహిస్తాయని ఇందులో భాగంగా పది పంచాయతీల్లోని వివరాల నమోదును గోపాలమిత్ర, పశుసంవర్థక సహాయకులు, ఇతర సిబ్బంది చేపట్టాలని తెలిపారు. మండలంలో ఉన్న 9660 ఇళ్లను సర్వే చేసి వారి వద్ద నుంచి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. వివరాల నమోదు ప్రక్రియను పూర్తిగా పశుసంవర్ధక శాఖ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.

వాల్మీకిపురం పెద్దచెరువును తవ్వేశారు..



వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె దళితవాడకు వెళ్లే మార్గంలో ఉన్న పెద్దచెరువును ఇష్టారాజ్యంగా తవ్వేశారు. గ్రామ సమీపంలో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుండగా చెరువు ప్రాంతం నుంచి మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేశారని అంతేకాక బొరియలుగా మారిన పెద్దచెరువును భారీ బండరాళ్లతో పూడ్చే దిశగా చేస్తున్నారని దళితవాడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములకు, పశువులకు ఎంతో అనుకూలంగా ఉండే పెద్దచెరువు ప్రాంతం మొత్తం ధ్వంసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బండరాళ్లతో చెరువు ప్రాంతాన్ని కనుమరుగు చేస్తున్నారని ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కత్తితో దాడి..వ్యక్తికి తీవ్ర గాయాలు

బి.కొత్తకోట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసి గాయపరచిన సంఘటన బి.కొత్తకోట మండలం గట్టు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేర కు గ్రామానికి చెందిన శీతప్ప(58), గోపాల్‌లు మద్యం తాగి గొడవపడ్డారు. ఆవేశంతో విచక్షణ కోల్పోయిన గోపాల్(56) కత్తితో శీతప్ప పై దాడిచేసి గొంతుపై కోశాడు. దీంతో శీతప్ప పీక కొంతమేర తెగింది. వెంటనే కుటుంబీకులు 108కి, పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ బొజ్జేనాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన శీతప్పను 108లో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మదనపల్లె పట్టణం కమ్మగడ్డవీధిలో నివాసం ఉంటున్న నౌషాద్ అలీ(50) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నాడు. ఈ క్రమంలోనే తన తల్లికి ఇటీవల ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తిరుపతికి తీసుకెళ్లి ఆపరేషన్ కూడా చేయించి మంగళవారం రాత్రి ఇంటికి వచ్చారు. దీంతోపాటు ఇంట్లో ఆర్థిక ఒత్తుళ్లు ఎక్కువ ఉండడంతో అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని సీఐ తెలిపారు. మదనపల్లె జిల్లాఆస్పత్రిలో చికిత్స అనంతరం తిరుపతికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖైదీల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

మదనపల్లె టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చట్ట ప్రకారం సబ్ జైలులో రిమాండులో ఉన్న ఖైదీల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని రాయలసీమ జైళ్లశాఖ డీఐజీ రాజేశ్వరరావు సూచించారు. బుధవారం మదనపల్లె సబ్ జైలును ఆయన జిల్లా జైళ్ల సూపరింటెండెంట్ వేణుగోపాలరెడ్డితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుష ఖైదీలు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీల ములాఖత్ కోసం వచ్చే బంధువుల వివరాలను తప్పకుండా తీసుకోవాలని, నిబంధనల మేరకే ములాఖత్‌లకు అనుమతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

కురబలకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయన కథనం మేరకు విజయవాడ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. అందులో భాగంగా కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ దిగువ గొల్లపల్లెకు చెందిన రెడ్డప్ప(41), ముదివేడు బస్ స్టాపు వద్ద అమ్మకానికి మద్యం బాటిళ్లను తీసుకెళుతుండగా దాడి చేసి అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అతనిని మదనపల్లె ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

గొల్లపల్లిలో తీరిన డ్రైనేజీ సమస్య

నిమ్మనపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి గొల్లపల్లిలో గత కొన్నేళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యను అధికారులు పరిష్కరించారు. ఏఆర్‌ఈజీఎస్, గ్రామ పంచాయతి నిధులతో మురుగునీటి కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవోఆర్‌డీ చలపతిరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గొల్లపల్లిలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగునీటి కాలువ రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడేవారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఏఆర్‌ఈజీఎస్, గ్రామ పంచాయతి నిధులు కేటాయించడంతో కొత్తగా మురుగునీటి కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతుండంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసిన చంద్రబాబు

ములకలచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వార్షిక బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి, అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేసారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. ములకలచెరువులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి 39,007 కోట్లు కేటాయించి అగ్రస్థానం ఇచ్చారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. బీసీలే పార్టీకి వెన్నుముక అని, బీసీల పార్టీ టీడీపీనని ఎన్నికల ముందు చెప్పినట్లు నిరూపించారన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం



వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం వైభవంగా అయ్యప్ప స్వామి నగరోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయాత్పూర్వం స్వామివారికి అభిషేకం, హోమం విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం మాల ధరించిన అయ్యప్ప భక్తులు అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, వినాయకుడి ప్రతిమలను పుష్ప పల్లకిపై అలంకరణలు చేసి పురవీధులు గుండా ఊరేగించారు. అనంతరం సాయంత్రం ఆలయంలో అంబలం, పడిపూజ కార్యక్రమాలు కనుల పండుగగా నిర్వహించారు. ఈసందర్భంగా వేలాదిమంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో గురుస్వాములు రామచంద్ర, బలరామ్, నిర్మాల శేఖర్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

రేపు ఝరి కోనలో లక్ష దీపోత్సవం

కలకడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయానికి అనుసంధానంగా ఉన్న ఝరికోనలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం కార్తీక లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు తిప్పారెడ్డి తెలిపారు. కార్యక్రమాలో భాగంగా ఆ రోజు ఉదయం స్వామి వారి ఊరేగింపు సాయంత్రం అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం, సైకతలింగ పూజ, బిల్వార్చన, లక్ష దీపోత్సవం, జ్వాలాతోరణం తదితర పూజలు అన్నదానం ఉంటుందని తెలిపారు.

జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయండి



వాల్మీకిపురం కోర్టులో న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గురు అరవింద్ పేర్కొన్నారు. బుధవారం కోర్టులో న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు కక్షిదారు లకు చట్టం, న్యాయాల పట్ల అవగాహన కల్పిస్తూ కేసులను రాజీ చేసుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, బార్ అసోసియేషన్ సెక్రటరీ రమణ, న్యాయవాదులు, మండల న్యాయసేవాధిక సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ములకలచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులోని రైల్వేగేటు సమీపంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాధ్ తెలిపారు. జనసేన పార్టీ, మదనపల్లె అగర్వాల్ దృష్టి కంటి ఆస్పత్రిల అధ్వర్యంలో జరిగే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టమోటా పంటకు జాగ్రత్తలు తీసుకోవాలి

పీలేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా టమోటా తోటలలో నిలిచిన నీటిని తొలగించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీలేరు మండల ఉద్యాన శాఖాధికారి సుకుమార్ రెడ్డి తెలిపారు. పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ పరిధిలో టమోటాతోపాటు సాగవుతున్న ఇతర ఉద్యాన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు తోటలో లేకుండా తీసివేసి పొలం త్వరగా ఆరేటట్లు చూడాలన్నారు. టమోటా మొక్కలపై లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి రెండు నుంచి మూడుసార్లు పిచికారి చేయాలన్నారు. వాతావరణంలో అధిక తేమ ఉండడం వల్ల పంటను ఆకుమచ్చ తెగులు ఆశిస్తుందని, దాని నివారణకు లీటరు నీటికి కార్బన్డిజం ఒక గ్రాము లేక మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు పిచికారి చేయాలన్నారు.

కోళ్లబైలు-2 సర్పంచ్ గైర్హాజరుపై విచారణ

మదనపల్లె టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు-2 గ్రామ పంచాయతీ సర్పంచ్ శశికళ విధులకు గైర్హాజరుపై డీఎల్పీవో నాగరాజు విచారణ చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం కోళ్లబైలు-2 గ్రామ సచివాలయంలో పంచాయతికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో మూడు నెలలకు ఒకసారి నిర్వహించిన వార్డు సభ్యుల సమావేశాల మినిట్స్ పుస్తకం పరిశీలించామని, అందులో వార్డు సభ్యులు సమావేశానికి హాజరు కాకపోయినా అయినట్లు సంతకాలు ఉండటంపై పూర్తి స్థాయిలో విచారిస్తామన్నారు. సర్పంచ్ శశికళకు ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ఏడు రోజుల్లో సమాధానం రాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆమెపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అబ్దుల్‌షుకూర్, పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

బి.కొత్తకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర పంచా యతీ పరిధిలో టీడీపీ సభ్యత్వ నమోదు బుధవారం ముమ్మరంగా జరిగింది. మండల పార్టీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, కుడుం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలో నూతన సభ్యులను పలువురిని చేర్పించారు. బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో 15వేల సభ్యత్వాలు లక్ష్యంగా పనిచేస్తున్నామ న్నారు. కార్యక్రమంలో నాయకులు టీడీపీ టౌన్ అధ్యక్షులు బంగారు వెంకట్రమణ, సుకుమార్, రాజాచాకనా, సురేంద్రబాబు, కురవప్రకాష్, దేవుడునాగరాజు, శరత్, రంజిత్, మురళి, శిల్పాఅంజినేయులు, సిద్దప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనుల పరిశీలనలో ఏడీఈ

తంబళ్లపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఏడీఈ గోవిందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తంబళ్లపల్లెలో లోవోల్టేజి సమస్య నివారణకు చేపడుతున్న పనులను ఏడీఈ పరిశీలించారు. తొలుత తంబళ్లపల్లె 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కెపాసిటర్ బ్యాంకును పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని తూర్పు దళితవాడలో సింగల్ ఫేస్ నుంచి త్రీ ఫేస్‌గా కన్వర్షన్ చేసిన విద్యుత్ లైన్లను, టీవీ రిలే స్టేషన్, నల్లగుట్ట వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ తంబళ్లపల్లె విద్యుత్ ఉపకేంద్రంలో 2 ఎంవీఏ కెపాసిటర్ బ్యాంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిని అతి త్వరలో డీఈ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో ఏర్పాటు చేస్తున్న 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ శేషుకుమార్, లైన్‌మెన్ శంకర, సిబ్బంది ఉన్నారు.

చిన్నారులను న్యుమోనియా నుంచి కాపాడాలి



సచివాలయంలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఐవో ఉషశ్రీ

పీలేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారులను న్యూమోనియా బారి నుంచి కాపాడాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ పీలేరులోని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని సచివాలయంలో జరుగుతున్న టీకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో న్యుమోనియా ఒకటని, అవగాహనతో దాని నియంత్రణ సాధ్యమన్నారు. న్యుమోని యాపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. అనంతరం సచివాలయంలో జరుగుతున్న టీకాల పంపిణీ ప్రక్రియ, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్‌లో నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమ, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించకుంటే ఉద్యమాలు



సమావేశంలో మట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ములకలచెరువు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ములకలచెరువును కరువు మండలంగా ప్రకటించకుంటే ఉద్యమాలు తప్పవని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బుధవారం జరిగిన రైతు సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ ములకలచెరువును కరువు మండలంగా ప్రకటించాలన్నారు. అనంతరం తంబళ్లపల్లె నియోజకవర్గ కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రామానాయుడు, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, సహాయ కార్యదర్శులుగా కదిరి రమేష్, లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, సురేష్, ప్రచార కార్యదర్శిగా చంద్ర, కమిటీ సభ్యులుగా పాపిరెడ్డి, ఇమ్రాన్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు చౌడప్పయాదవ్, నాయకులు అమరావతి, లక్ష్మీదేవి, వేమన్న, నిజాముద్దీన్, వేమనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా.. అయినా రాద్ధాంతం

పెద్దమండ్యం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండల సర్వసభ్య సమావేశాని అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుగానే ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చి ఎంపీడీవో కార్యాలయం వద్ద నోటీసు బోర్డులో ప్రకటించినట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. అయినా ఎంపీడీవో కార్యాలయంలోకి వెలుతున్న వైసీపీ నాయకులను కూటమి నేతలు అడ్డుకున్నారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. వైసీపీ హయంలో ప్రజాస్వామ్య పద్ధతి లో ఎంపిక కానీ ప్రజాప్రతినిధులు కూటమి ప్రభుత్వ అభివృద్ధి పనులపై చర్చించడానికి అనర్హులని జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడి కూటమినేతలు గంగాధర, కుంటకిందపల్లి చంద్రారెడ్డి, రఘునాధరెడ్డి, కాలేషా, మహేశ్వర, మోహనా, ప్రకాష్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు వాదించారు. మండల సమావేశాలను అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని ఎంపీపీ పూర్ణచందిక పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ములకలచెరువు సీఐ రాజారమేష్ అక్కడికి చేరుకొని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. తదుపరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహణ తేదీలు ప్రకటిస్తామని ఎపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు.

సీసీరోడ్ల నిర్మాణాల్లో నాణ్యతలు పాటించాలి



సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

కురబలకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కడప క్రాస్, కురబలకోటలో పల్లె పండుగ ద్వారా వేసిన రోడ్ల నాణ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్తైన సీసీ రోడ్లకు త్వరగా బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కనసానివారిపల్లె, మట్లివారిపల్లె ఎఫ్ఏల అవినీతి, అక్రమాలపై పలు వురు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చించాలి



ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపడుతున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం నవంబర్ 13(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపా ధ్యాయులుఎంతో ఆశగా ఎదురు చూస్తున్న 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిపై రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ప్రకటించాలని ఎస్టీ యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన్‌లు పేర్కొన్నారు. బుధవారం వారు పీటీఎం మండలంలోని ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పీఆర్సి రూపంలో రివర్స్‌లో చేదు అనుభవం ఎదు రైందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని 12వ పీఆర్సీ విషయంలో కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కడియాల మురళి, కార్యదర్శి రాజారెడ్డి, కన్వీనర్లు అశోక్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీనారాయణ, సుధాకర్, పీటీఎం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సెల్ఫ్ డిక్లరేషన్‌తో జనన ధృవపత్రాలు

తంబళ్లపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : జనన ధృవీకరణపత్రాల కోసం దరఖాస్తు చేయు విద్యార్థులు అఫిడవిట్ స్థానంలో విద్యార్థుల సెల్ఫ్ డిక్లరేషన్‌తో పాటు స్టడీ సర్టిఫికెట్ కానీ మార్కుల జాబితా పత్రం ఇచ్చినా సరిపోతుందని తహసీల్దారు హరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఇక మీదట బర్త్ సర్టిఫికేట్స్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అఫిడవిట్‌కు బదులుగా సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చినా ధృవపత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని తహసీల్దారు పేర్కొన్నారు.

కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటరమణ



వాల్మీకిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెకు చెందిన వల్లిగట్ల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. వెంకటరమణ గతంలో మండల టీడీపీ అధ్యక్షుడిగానూ, 2019లో కురబ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, జాతీయ పార్టీ ఉపాధ్యక్షుడిగా, కార్యనిర్వాహక కార్యదర్శిగా సేవలందించారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పదవి రావడం పట్ల సీఎం నారాచంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.